ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు

మంగళవారం 3 జూన్ 2025 | 5

అమలాపురం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 36(సోమవారం)
కనిష్ఠం : 30

ప్రపంచ స్థాయి ఇన్నోవేషన్ చాలెంజ్‌లో ఫైనల్‌కు చేరిన జీవీసీ విద్యార్థులు 6

రెప్పపాటులో.. ఘోరం!





మృతులు శివన్నారాయణ, దేవి లలిత,తీగిరెడ్డి శివ, వర్షిత, శాన్వి

20 నిమిషాల్లో గమ్యం.. అంతలోనే విషాదం

- వడిశలేరు వద్ద లారీని ఢీకొన్న కారు
- రెండు కుటుంబాలు ఛిద్రం
- ఐదుగురు మృతి..ఇద్దరికి గాయాలు
- కలెక్టరేట్‌కు వెళ్లివస్తుండగా ఘటన
- మృతులది రఘునాథపురం

రాజమహేంద్రవరం/రంగంపేట, జూన్ 2 (ఆంధ్రజ్యోతి):సాయంత్రం వరకూ కాకినాడ బీచ్‌లో సరదాగా గడిపారు.. ఆ కబుర్లు చెప్పుకుంటూ ఎంతో ఆనందంగా ఇంటికి బయలు దేరారు..మరో 20 నిమిషాల్లో ఇంటికి వెళ్లిపోతారు..రెప్పపాటులో ఘోరం జరిగిపోయింది.. అతివేగం తీరని విషాదం నింపింది. బావా బావమరుదుల కుటుంబంలో ఐదుగురు అక్కడికక్కడే మృతిచెందారు.దీంతో తీవ్ర విషాదం నెలకొంది.రాజానగరం మండలం దివాన్‌చెరువు పరిధిలోని రఘునాథపురం గ్రామానికి చెందిన రేలంగి శివన్నారాయణ, రాజమండ్రి రూరల్ మం డలం పిడింగొయ్యి పంచాయతీ పరిధిలోని కవలగొయ్యికు చెందిన తీగిరెడ్డి శివ బావా బామ్మర్దులు.ఎక్కడికెళ్లినా కలిసేవెళతారు.. ఇద్దరూ సరదాగా ఉంటారు. రేలంగి శివన్నారాయణకు కవల పిల్లలు వర్షిత, హర్షిత. వీరికి 13 సంవత్సరాలు. వీరి ఆధార్ అప్‌డేట్ చేసుకోవడం కోసం గత కొద్దిరోజులుగా కాకినాడ కలెక్టరేట్‌కు వెళ్లి వస్తున్నారు. దీనిలో భాగంగానే సోమవారం పీజీ ఆర్ఎస్ ఉండడంతో ఉదయం 9గంటల ప్రాం తంలో ఎస్‌యూవీ జైలో కారులో రేలంగి శివన్నారాయణ (40),ఆయన సతీమణి రేలంగి దేవి లలిత (34), వారి కవల పిల్లలు వర్షిత(13), హర్షిత (13), ఆయన బావమరిది తీగిరెడ్డి శివ(30) ,ఆయన సతీమణి తీగిరెడ్డి భవాని (26), కుమార్తె తీగిరెడ్డి సాన్వి(4) కలిసి సోమవారం కారులో కాకినాడ వెళ్లారు. కాకినాడలో పని చూసుకొని బీచ్‌కి వెళ్లి సరదాగా గడిపారు.భోజనం అనంతరం సాయంత్రం 5 గంటల ప్రాంతంలో తిరుగు పయనమయ్యారు. 20 నిమిషాల్లో ఇంటికి చేరిపోతారనగా రెండు కుటుంబాలు రెప్పపాటులో ఛిద్రమైపోయాయి. వీరిలో ఐదుగురు మృతిచెందగా హర్షిత, భవాని ఒక ప్రైవేట్‌ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

కారును కిరాయికి తెచ్చి..

రియల్ ఎస్టేట్, ఫైనాన్స్ తదితర వ్యాపారాలు చేస్తున్న శివన్నారాయణ ఓన్ డ్రైవింగ్ విధానంలో కారును స్నేహితుడి నుంచి ఎప్పటి మాదిరిగానే కిరాయికి తీసుకున్నాడు. కారును బావమరిది శివ నడుపుతున్నాడు. ఏడీబీ రోడ్డులోని వడిశలేరు సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద రంగం పేటలోని ఓ డైయిరీ నుంచి పాల లోడుతో వస్తున్న ట్యాంకరు రోడ్డుపై నిలిపి ఉంది. అక్కడ రోడ్డు మరమ్మతులు చేస్తుం డడంతో డైవర్షన్ బారికేడ్లు పెట్టారు. ఎడమ వైపున లారీ ఆగి ఉంది. అక్కడికి వచ్చాక కారును కుడి వైపునకు మళ్లించాల్సి ఉంది. అయితే కారు వేగంగా వస్తుండడంతో మలుపు తిప్పే సమయంలో కుడి వైపునకు తిరగకుండా నేరుగా ఎదురుగా ఉన్న పాల ట్యాంకరులోకి దూసుకుపోయింది. దీంతో ముం దు సీట్లో కూర్చున్న శివన్నారాయణ, శివ, మధ్య సీట్లోని వర్షిత, లలిత, శాన్వి అక్కడికక్కడే మృతిచెందారు.వెనుక సింగిల్ సీట్లలో కూర్చున్న భవానీ, హర్షిత తీవ్రంగా గాయపడగా ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందున్నారు. ఏడీబీ రోడ్డులో సుమారు ఆరేళ్లగా మరమ్మతులు చేస్తూనే ఉన్నారు. దీంతో ఎక్కడపడితే అక్కడ బారికేడ్లు, డైవర్షన్లు ఉండడంతో అయోమయం ఏర్పడి ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు.ఆస్పత్రి వద్దకు మంత్రి కందుల దుర్గేష్ చేరుకొని బాధిత కుటుం బాలను ఓదార్చారు. రెండు కుటుంబాల్లో విషాదం కలచివేస్తోందన్నారు. మృతుల్లో కొందరికి జనసేన సభ్యత్వం ఉందని చెబుతున్నారని, ఆ మేరకు ఆర్థిక సహాయం అందించడానికి ప్రయత్నిస్తామన్నారు. బాధితులను రాజానగరం ఎమ్మెల్యే బలరామకృష్ణ సతీమణి వెంకటలక్ష్మి పరామర్శించి ధైర్యం చెప్పారు. అడిషనల్ ఎస్పీ మురళీకృష్ణ, డీఎస్పీలు దివ్య, రమేష్ బాబు, సీఐ అప్పారావు ప్రభుత్వాసుపత్రికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. పాలవ్యాన్ డ్రైవర్ పరారీలో ఉన్నాడు. ప్రమాదంపై రంగంపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



కవలలను విడదీసిన ప్రమాదం

శివన్నారాయణ దంపతులకు ఇద్దరు ఆడ పిల్లలు, ఒక అబ్బాయి ఉన్నారు. అబ్బాయి ఇంటి దగ్గరే ఉండిపోవడంతో ప్రాణాలు దక్కాయి. ఇద్దరు కుమార్తెలు హర్షిత,వర్షిత కవలలు. పుట్టుక దగ్గర నుంచీ కలిసే ఉన్నారు. కలిసి చదువుకుంటున్నారు. ఇప్పు డు వర్షిత.. హర్షితను 13 ఏళ్లకే వదిలి వెళ్లిపోయిందం టూ బంధువులు రోదిస్తున్న తీరు కలచివేసింది.



వివరాలు తెలుసుకుంటున్న మంత్రి దుర్గేష్

పదిరోజుల్లో పూడికతీత పనులు పూర్తి చేయాలి

- కలెక్టర్ మహేష్‌కుమార్ ఆదేశం

అమలాపురం, జూన్ 2(ఆంధ్రజ్యోతి): గోదావరి డెల్టాలో కాల్వల మూసివేత సమయంలో చేపట్టిన షట్టర్ల మరమ్మతులు, పూడికతీత పనులను పదిరోజుల్లో పూర్తి చేయాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ జలవనరులు, డ్రైనేజీ విభాగపు ఇంజనీర్లను ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఇంజనీర్లతో సోమవారం సమావేశం నిర్వహించి అభివృద్ధి పనులపై సమీక్షించారు. నియోజకవర్గాల వారీగా మంజూరైన పనులను త్వరితగతిన పూర్తి చేసి కాల్వల శివారు ఆయకట్టు భూముల వరకు సాగునీరు సక్రమంగా పారేలా చర్యలు తీసుకోవాలన్నారు. డ్రైనేజీలలో మురుగునీరు దిగువకు పారేలా చర్యలు తీసుకుంటూ పంటలకు ఎటువంటి ముంపు వాటిల్లకుండా చర్యలు చేపట్టాలన్నారు. రూ.5లక్షల అంచనా వ్యయంతో చేపట్టే మేజర్ పనులను నీటి వినియోగదారుల సంఘాల ప్రాజెక్టు కమిటీలకు చిన్న పనులను డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు నామినేషన్ పద్ధతిన కేటాయించాలన్నారు. గోదావరి సెంట్రల్ డెల్టా పరిధిలోని అమలాపురం నియోజకవర్గంలో జలవనరులశాఖకు సంబంధించి 34 పనులు, కొత్తపేటలో 29, ముమ్మిడివరంలో 24, పి.గన్నవరంలో 27, రాజోలు నియోజకవర్గంలో 31 పనులతో కలిపి 145 పనులకు రూ.168.76లక్షలతో చేపట్టినట్టు కలెక్టర్ వివరించారు. డ్రైనేజీ విభాగానికి సంబంధించి అమలాపురం నియోజకవర్గంలో 45, కొత్తపేటలో 20, పి.గన్నవరంలో 25, రాజోలు 25, ముమ్మిడివరం 30, రామచంద్రపురం 27, మండపేట నియోజకవర్గంలో 25పనులతో కలిసి రూ.812.88లక్షలతో 195 పనులను చేపట్టినట్టు వివరించారు. వచ్చే ఖరీఫ్ సీజన్‌లో రైతులకు సాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. సమావేశంలో జలవనరులశాఖ కార్యనిర్వాహక ఇంజనీర్ బి.శ్రీనివాసరావు, డ్రైనేజీ డివిజన్ ఈఈ ఎంవీవీ కిశోర్ పాల్గొన్నారు.

వసంతవాడలో కేంద్ర నోడల్ బృందం పర్యటన 6

ఇదే బావుంది

- రేషన్ బియ్యం పంపిణీ విధానంపై ప్రజల హర్షం
- ఇంటింటికీ ఇవ్వడంపై వృద్ధులు, దివ్యాంగుల్లో ఆనందం
- గంటల తరబడి వీధుల్లో నిల్చోవడం తప్పిందంటున్న మహిళలు
- పనులు మానుకోవాల్సిన అవసరం లేకపోయిందన్న కూలీలు
- జిల్లాలో 5.37లక్షల కార్డులకు గాను రెండురోజుల్లో 87వేల కార్డుదారులకు బియ్యం పంపిణీ పూర్తి



అమలాపురంలో దివ్యాంగురాలి ఇంటికి వెళ్లి రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్న నాయకులు

రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం నుంచి చౌక డిపోల ద్వారా రేషన్ బియ్యం అందజేసే కార్యక్రమానికి అట్టహాసంగా శ్రీకారం చుట్టింది. ఈ పంపిణీ విధానంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 1నుంచి 15వరకు ఎప్పుడైనా రేషన్ తీసుకోవచ్చని, పనులు మానుకోవక్కర్లేదని మధ్యతరగతి ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తుండగా వీధిలో బారులుగా నిలబడే పని తప్పిందని మహిళలు అభిప్రాయపడ్డారు. ఇంటికే సరుకులు తెచ్చి ఇవ్వడంపై దివ్యాంగులు, వృద్ధులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ ప్రభుత్వంలో ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ బియ్యం, పంచదార వంటి నిత్యావసర వస్తువులను అందించేవారు. వాటిల్లో బియ్యం అక్రమంగా తరలిపోతున్నాయనే అభియోగాలపై ఆ వ్యవస్థకు స్వస్తి చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం రేషన్ డిపోల ద్వారానే ఇకపై బియ్యంతో సహా ఇతర నిత్యావసర వస్తువులు పంపిణీకి ఆదివారం నుంచి పునఃప్రారంభించింది. మంత్రులు, ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో చౌక డిపోల పునఃప్రారంభించారు. ఆది, సోమవారాల్లో జిల్లాలో రేషన్ బియ్యం పంపిణీ మందకొడిగానే కొనసాగింది. జిల్లా పరిధిలోఉన్న మొత్తం 923 చౌకడిపోల ద్వారా 5,37,902 కార్డుదారులకు సంబంధించి 7,654 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ చేయాలని సివిల్ సప్లయిస్ అధికారుల ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ రెండు రోజుల్లోను జిల్లాలో మొత్తం 87,570మంది కార్డుదారులకు సంబంధించి 17,574 క్వింటాళ్ల బియ్యం పంపిణీ చేసినట్టు పౌరసరఫరాలశాఖ అధికారి ఎ.ఉదయ్ భాస్కర్ తెలిపారు. 1 నుంచి 15 వరకు నిర్దేశిత సమయాల్లో చౌక డిపోల ద్వారా బియ్యం పంపిణీ ప్రక్రియ జరుగుతుందన్నారు. ప్రజల్లోకి ఈ అంశం వెళ్లాల్సి ఉండడంతో తొలి రెండు రోజుల్లో తక్కువమంది మాత్రమే బియ్యం తీసుకున్నారు. అధికారులు సైతం ఈ పంపిణీ విధానంపై దృష్టిపెట్టి కార్డుదారుల్లో చైతన్యం నింపాల్సి ఉంది. కొన్ని డిపోల పరిధిలో వృద్ధులకు, దివ్యాంగులకు సాయంత్రంవేళల్లో బియ్యం పంపిణీ డీలర్ల ఆధ్వర్యంలో కొనసాగుతోంది.



రేషన్ తిప్పలు తప్పాయి

అమలాపురం: మంచానికే పరిమితమై ఉన్నాను. గత వైసీపీ ప్రభుత్వంలో రేషన్ సరుకులు తెచ్చే ఎండీయూ వాహనం కోసం ఎదురుచూస్తూ గడపాల్సి వచ్చేది. ఇప్పుడా పరిస్థితిలేదు. నాకు ఇంటికే సరుకులు తీసుకువచ్చి ఇచ్చారు. భవిష్యత్తులో ఈ విధానాన్ని కొనసాగించాలి.

-ఉంగరాల సరస్వతి, వృద్ధురాలు, అమలాపురం

దివ్యాంగులకు ఉపయుక్తం



అమలాపురం: నేను దివ్యాంగురాలిని. రేషన్ సరుకులకోసం రోజుల తరబడి ఎదరు చూడాల్సి వచ్చేది. సరుకులు ఇచ్చే బండి నెలలో ఏ రోజున ఎప్పుడు వస్తుందో తెలిసేది కాదు. ఇప్పుడు ఇంటికే తీసుకువచ్చి ఇచ్చారు. దివ్యాంగులకు ఈ విధానం ఎంతో ఉపయుక్తం.

-బర్ల సత్యవేణి, దివ్యాంగురాలు, అమలాపురం

ఎంతో నిరీక్షించాల్సి వచ్చేది



రేషన్‌బండి వచ్చిందంటే పనులన్నీ మానుకుని లైన్‌లో నిల్చొని చాలాసమయం నిరీక్షించాల్సి వచ్చేది. సమయానికి బండి వచ్చేది కాదు. ఏ సమయంలో వస్తారో తెలియక ఇబ్బంది పడేవాళ్లం. పాత పద్ధతివల్ల బాగుంది. రేషన్‌షాపు వద్దకు వెళ్లి తెచ్చుకునే అవకాశం ఉంది.

-అబ్బిరెడ్డి లక్ష్మి, అనాతవరం

పనులు మానక్కర్లేదు



గతంలో ఇంటింటికీ రేషన్ బండి ఒక్కసారి మాత్రమే వచ్చేది. దీంతో పనులు మానుకుని ఎదురుచూడాల్సి వచ్చేది. ప్రస్తుత విధానంవల్ల నెలలో 15రోజులపాటు ఎక్కడైనా బియ్యం తీసుకునే అవకాశం కల్పించారు. మాకు పనులకు అంతరాయం లేకుండా ఉంది.

-మారెళ్ల శేషారత్నం, కొమానపల్లి

ఈ విధానం బాగుంది



రేషన్ దుకాణాల ద్వారా సరుకుల పంపిణీ మంచి విధానం.వినియోగదారుడు 1 నుంచి 15వ తేదీ లోపు రేషన్ తీసుకోవచ్చు. గతంలో ఎండీయూ వాహనం వచ్చినప్పుడే రేషన్ తీసుకోవాల్సి వచ్చేది. రాష్ట్రంలో ఏ దుకాణం నుంచైనా వినియోగదారుడు రేషన్ తీసుకోవచ్చు.

-ఎ.ఉదయ్‌భాస్కర్, జిల్లా సివిల్ సప్లయి అధికారి

జిల్లావ్యాప్తంగా యోగాంధ్రకు ఇప్పటికి..

5.74 లక్షలమంది పేర్లు నమోదు

- నేడు అంతర్వేది బీచ్‌లో మెగా యోగా శిబిరం
- పౌరులు వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలి: కలెక్టర్, జేసీ

అమలాపురం, జూన్ 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొనే పౌరులు వెబ్‌సైట్‌లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని జేసీ టి.నిషాంతి పిలుపునిచ్చారు. జిల్లాలో ఇప్పటివరకు 5.74లక్షలమంది పేర్లు నమోదు చేసుకున్నారని, గ్రామస్థాయిలో జరిగే యోగా పోటీల్లో 42,904మంది విజేతలయ్యారు. వీరంతా మంగళవారం నుంచి మొదలయ్యే మండలస్థాయి పోటీల్లో పాల్గొంటారని, ఆరోగ్యకరమైన ఆనందకరమైన సమాజంకోసం ప్రతిఒక్కరూ యోగా అలవాటు చేసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా యోగాంధ్ర కార్యక్రమాన్ని మే 21 నుంచి జూన్ 21 వరకు నెలరోజులపాటు చేపడుతున్నామని తెలిపారు. జూన్ 21న విశాఖపట్నంలో రాష్ట్రప్రభుత్వం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. యోగా కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత చేరవ చేయాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో 7.25లక్షల మంది పౌరులు రిజిస్ట్రేషన్ లక్ష్యంగా నిర్ణయించగా సోమవారం సాయంత్రానికి 5.74లక్షల మంది రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని, జిల్లాలో 4,635 మంది ట్రైనర్లు రిజిస్ట్రేషన్ లక్ష్యంగా నిర్ణయించుకోగా 4833మంది ట్రైనర్లు రిజిస్టర్ అయ్యారన్నారు. సంబంధిత ట్రైన్లకు మాస్టర్ ట్రైనర్లు ప్రొటోకాల్ యోగాపై శిక్షణపొందిన తర్వాత ట్రైనర్లు తిరిగి పౌరులకు యోగాపై అవగాహన కల్పిస్తారని జేసీ తెలిపారు.

అంతర్వేది బీచ్‌లో 3వేల మందితో..

సఖినేటిపల్లి మండలం అంతర్వేది సముద్ర తీరంలో మంగళవారం 3వేలమందికి పైగా పాల్గొనేలా ఉదయం 7గంటలనుంచి 8 గంటల వరకు యోగా శిబిరం నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ మహేష్‌కుమార్ తెలిపారు. మెగా యోగా శిబిరాన్ని బీచ్‌లో నిర్వహిస్తున్నందున భారీసంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. 3వేలమంది పాల్గొనే రీతిలో ఇక్కడ ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. సులభంగా చేయగల యోగాసనాలు, శ్వాస పద్ధతులు నేర్పిస్తామని యువత, విద్యార్థులు, మహిళలు, వృద్ధులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

శివారు ఆయకట్టులో సార్వా సాగు ఎలా?

- పంట కాల్వలు, డ్రెయిన్లలో పూడిక తీయలేదు
- కోనసీమ రైతు పరిరక్షణ సంఘం ఆందోళన



కోనసీమ రైతు పరిరక్షణ సంఘ సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు యాళ్ల బ్రహ్మానందం

ఉప్పలగుప్తం, జూన్ 2(ఆంధ్రజ్యోతి):కోనసీమవ్యాప్తంగా పంటకాల్వల్లో ఆరేళ్లగా పూర్తిస్థాయిలో పూడికతీత పనులు చేపట్టనందునశివారు ఆయకట్టు పొలాలకు సార్వాలో సాగునీరు అందే అవకాశం లేదని కోనసీమ రైతు పరిరక్షణ సంఘం ఆందోళన వ్యక్తం చేసింది. సంఘం అధ్యక్షుడు యాళ్ల బ్రహ్మానందం అధ్యక్షతన సోమవారం గొల్లవిల్లిలో సమావేశం జరిగింది. ఆయా మండలాల్లో పంటకాల్వలు, డ్రెయిన్ల పరిస్థితిపై సమావేశంలో చర్చించారు. మైనర్, మీడియం, రెవెన్యూ డ్రెయిన్లలో తూడు, గుర్రపుడెక్క తొలగించనందున ఏటాసార్వాలో రైతులు పంట నష్టపోతున్నారని సంఘం ప్రధాన కార్యదర్శి అయితాబత్తుల ఉమామహేశ్వరరావు వ్యాఖ్యానించారు. మేజర్, మీడియం డ్రెయిన్లలో చేపల వలకట్లను తొలగించడంలో అధికారులు దృష్టి పెట్టనందున రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. మే 8వతేదీ తర్వాత రైతులనుంచి కొన్న ధాన్యానికి ఇప్పటికీ సొమ్ముచెల్లించకపోవడంపై రైతుప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు.ఈ-క్రాప్ నమోదు ప్రకారం మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉండగా టార్గెట్ పూర్తయిందని అధికారులు చెప్పడం వింతగాఉందన్నారు. తక్షణం రైతులకు ధాన్యం సొమ్ములు చెల్లించాలని, యుద్ధ ప్రాతిపదికన కాల్వలు, డ్రెయిన్లలో పూడికతీతలు చేపట్టాలని సమావేశంలో తీర్మానించారు.ఉప్పలగుప్తం, అల్లవరం, ఐ.పోలవరం, మలికిపురం, అమలాపురం, కాట్రేనికోన, ముమ్మిడివరం మండలాల రైతుప్రతినిధులు అడబాల సత్యనారాయణ, మోటూరి విశ్వనాథం, దంగుడు బియ్యం గంగరాజు, పెమ్మిరెడ్డి సత్యనారాయణ, జి.నాగరాజు, చిక్కం పెద్దబ్బులు, దామిశెట్టి చంటి, ఆర్.స్వామినాయుడు, ఎంవీ నరసింహారావు, నల్లా సత్యనారాయణ, మంచెం బాలకృష్ణ, సీతారామస్వామి పాల్గొన్నారు.



అర్జీదారుల సమస్య వింటున్న ఎస్పీ కృష్ణారావు

ఎస్పీ గ్రీవెన్స్‌కు 18 అర్జీలు

అమలాపురం టౌన్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ప్రజలనుంచి అందే అర్జీలను పరిష్కరించడంలో క్షేత్రస్థాయి అధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించాలని ఎస్పీ బి.కృష్ణారావు సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలలనుంచి వచ్చిన వారి సమస్యలపై 18అర్జీలను ఎస్పీ స్వీకరించారు. సంబంధిత పోలీసు అధికారులు అర్జీలను పరిష్కరించి నిర్ణీత గడువులోగా సమాచారం అందించాలని ఆయన సూచించారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో 212 అర్జీల స్వీకరణ

అమలాపురంటౌన్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ప్రజా సమస్యలను నేరుగా స్వీకరించి సంబంధిత అధికారులకు పంపి పరిష్కరించడం ద్వారా ప్రభుత్వ సేవలు మెరుగు పరిచే లక్ష్యంతో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ పేర్కొన్నారు. సమస్యపై అందించిన అర్జీ స్థితిని ఆన్‌లైన్‌లో పోర్టల్ ద్వారా, 1100కు కాల్‌చేసి ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చునన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు జేసీ టి.నిషాంతి. జిల్లా రెవెన్యూ అధికారి బీఎల్ఎన్ రాజకుమారి, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, డీఆర్డీఏ పీడీ సాయినాథ్ జైచంద్రగాంధీ, సర్వశిక్ష అసిస్టెంట్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ జి.మమ్మీ జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వారినుంచి 212 అర్జీలను స్వీకరించారు. ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం జరగకుండా చూడాలనిసూచించారు. ఎస్‌డీసీ పి.కృష్ణమూర్తి, జిల్లాపరిశ్రమల కేంద్రం జీఎం పీకేపీ ప్రసాద్, డీఈవో డాక్టర్ షేక్ సలీంబాషా, డీఎస్డీవో పీఎస్ సురేష్‌కుమార్, ఆయుష్ మెడికల్ ఆఫీసర్ విజయకుమారి, డీఎల్డీవో రాజేశ్వరరావు, జిల్లా పశుసంవర్థక అధికారి వెంకట్రావు,వ్యవసాయాధికారి వి.బోసుబాబు, డీఐపీఆర్వో కె.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



అర్జీదారుల సమస్య వింటున్న కలెక్టర్ మహేష్‌కుమార్

క్షయవ్యాధి నిర్మూలన పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్

అమలాపురంటౌన్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): క్షయ వ్యాధిపై అప్రమత్తంగా ఉంటూ వ్యాధి నిర్మూలనకు ప్రతిఒక్కరూ అవగాహన పెంపొందించుకునేందుకు జాతీయ కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రకటించినట్టు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో టీబీ ముక్త భారత్ అభియాన్ కింద జాతీయ క్షయవ్యాధి నిర్మూలన ప్రచార గోడపత్రికను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతీయ క్షయ వ్యాధి నిర్మూలన ద్వారా వ్యాధి స్ర్కీనింగ్ పరీక్షలు నిర్వహిస్తారన్నారు. హెచ్ఐవీ బారిన పడ్డవారు వైద్యపరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. టీబీ నిర్మూలనను ప్రజాఉద్యమంగా మార్చాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావుదొర, అదనపు డీఎంహెచ్‌వో డాక్టర్ సీహెచ్‌వీ భరతలక్ష్మి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.




పచ్చని చిలుకలు తోడుంటే...

ఆ ఇల్లు పక్షుల కిలకిలారావాలతో ప్రతిధ్వనిస్తుంది. మండు వేసవి అయినా సరే పక్షులకు చల్లటి వాతావరణం కల్పించేందుకు ఆ కుటుంబంలోని సభ్యులందరూ వంతులవారీగా సమయం నిర్దేశించుకుని నిత్యం శ్రమిస్తారు. కాకినాడ జిల్లా సామర్లకోట ఇస్మాయిల్ నగర్‌కు చెందిన ప్రముఖ ఫొటోగ్రాఫర్ అడబాల శ్రీనివాస్ ఇంట రెండున్నర దశాబ్దాలుగా వివిధ జాతులకు చెందిన 90 పక్షులు (లవ్ బర్డ్స్ చిలుకలు) పంజరాల్లో ఉంటున్నాయి. వాటికి ఆహారం, నీరు వంటి సదుపాయాలను కల్పించడంతో పాటు చల్లదనం కోసం పంజరానికి నలువైపులా గోనెబరకాలు కట్టారు. వేసవిలో 42 డిగ్రీల ఉష్ణోగ్రత నుంచి కాపాడేందుకు శ్రీనివాస్ కుటుంబ సభ్యులు శ్రమించారు. పరిసర ప్రాంతాలకు చెందిన వారు ఈ చిలుకలను చూసి ఆనందపడుతున్నారు.

సామర్లకోట (ఆంధ్రజ్యోతి)





నేరేడు పండు... పోషకాలు మెండు

సామర్లకోట, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): తీపి, పులుపు సమ్మేళనమే నేరేడు పండు. మే నెలాఖరు నుంచి జూన్ చివరి వరకు నేరేడు పండ్లు సీజనల్‌గా లభిస్తాయి. చూసేందుకు నల్ల ద్రాక్షపళ్ల వలే కనిపించే వీటిలో పలు పోషకాలు మన శరీరాన్ని ఆరోగ్యవంతంగా ఉంచుతాయి. ఈ పండ్లు తింటే జీర్ణ వ్యవస్థ చక్కగా పనిచేస్తుంది. వీటిని రసం చేసుకుని తాగితే కాలేయ సంబంధిత వ్యాధులు తగ్గిపోతాయి. క్యాలరీలు తక్కువగా ఉంటాయి కాబట్టి హెల్దీ స్నాక్స్‌గా తినొచ్చు. శరీర బరువు తగ్గించుకునేందుకు మంచి ఆహారంగా పనిచేస్తాయి. ఆస్తమా, విపరీతమైన దగ్గును నయం చేయడంలోనూ ఉపయోగపడతాయి. నేరేడు పండ్లలో గ్లూకోజ్, ఫ్రక్టోజ్‌తో పాటు నీరు కూడా ఎక్కువే ఉంటుంది. వీటిని తింటే దాహం తీరుతుంది. శరీరం చల్లబడుతుంది. కాకినాడ జిల్లా సామర్లకోట, పెద్దాపురం పట్టణాలతో పాటు పలు ప్రాంతాల్లో సైకిళ్లకు గంపలు కట్టుకుని నేరేడు పండ్లు విక్రయిస్తుండగా పలువురు కొనుగోలు చేస్తున్నారు. అంతేకాదు నేటి తరానికి వాటి రుచి చూపించి తినిపిస్తున్నారు.



పేదవారి కర్జూరం ఈత పళ్లు

గ్రామీణ ప్రాంతాల్లో వేసవి కాలంలో లభించే ఈత పళ్లకు పేదోళ్ల ఖర్జూరంగా పేరు ఉంది. వేసవిలో మాత్రమే లభించే వీటిని తినడం వల్ల కాల్షియం ఎక్కువగా అందుతుందని వైద్యులు చెప్తారు. ఎముకలు బలపడతాయని, ఆలోచనా శక్తి బాగా పెరుగుతుందన్న ప్రచారమూ ఉంది. ప్రతిరోజూ ఈతపళ్లు తినడం వల్ల జీర్ణశక్తి పెరుగుతుంది. క్యాన్సర్ వ్యాధి రాకుండా నిరోధిస్తుంది. ఐరన్ సమృద్ధిగా ఉండి రక్తం వృద్ధి చెందుతుంది.

ఎన్నేళ్లో వేచి ఉదయం రానే వచ్చింది. చాలా సంవత్సరాల క్రితం కలిసి చదువుకున్న వారంతా మరలా కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధుల్లేవు. ఎలా ఉన్నావు... ఏమి చేస్తున్నావు... అంటూ కుశలప్రశ్నలు వేసుకుని రోజంతా సందడిగా గడిపారు.
ఒకరినొకరు పరిచయం చేసుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి ఆటపాటలతో ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. తరగతి గదుల్లో చదువుకున్న క్షణాలను, అలనాటి జ్ఞాపకాలను గుర్తు తెచ్చుకున్నారు. తమ ఉన్నతికి కారణమైన గురువర్యులకు పాద పూజ చేసి ఘనంగా సత్కరించి వారి ఆశీస్సులు అందుకున్నారు. గురువులతో కలిసి భోజనాలు చేశారు.



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో గురువులతో 1984-89 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల గ్రూప్ ఫొటో

ఎన్నేళ్లో వేచిన ఉదయం

అమలాపురం, పటవలల్లో పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

అమలాపురం టౌన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం గండు వీధిలోని మున్సిపల్ హైస్కూలు 1984-89 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల అపూర్వ కలయిక సోమవారం జరిగింది. ఈ హైస్కూలు మహాత్మాగాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాలగా రూపాంతరం చెందడంతో వారంతా పట్టణంలోని ఏబీసీడీ ఫుడ్ కోర్టులో కలుసుకున్నారు. రాష్ట్ర, రాష్ట్రేతర ప్రాంతాల్లో స్థిరపడ్డ సుమారు 60 మంది విద్యార్థులు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలతో ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. అలనాడు విద్యాబుద్ధులు నేర్పించిన గురువులు ఎస్ఎస్ఎస్‌సీహెచ్ కృష్ణమూర్తి, బందా ఆర్.కామేశ్వరరావు, ఎల్ఎంఎన్, సావిత్రి మేడం, ఉమాదేవి, గంగాధర్, కేతా సత్యనారాయణ, భాస్కరాచార్యులు, యర్రమిల్లి పాండు రంగారావులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం గురువులకు పాదపూజ చేసి దుశ్శాలువాలు కప్పి పుష్పమాలలతో సత్కరించారు. కమల, యేడిద శ్రీను, నంద్యాల నాయుడు, నూకల శివ, ఉప్పలగుప్తం శ్రీనివాసరావు, ఎస్.లక్ష్మణకుమార్ నాయకత్వం వహించి నాటి విద్యార్థులను ఒక్కచోటకు చేర్చారు. అలనాటి మధుర స్మృతులను గుర్తు చేసుకుని ఆనందోత్సాహాలతో గడిపారు.

తాళ్లరేవు (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం పటవల జిల్లాప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల 1991-92 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు అదే పాఠశాలలో సోమవారం గెట్ టుగెదర్ నిర్వహించారు. ప్రేమ, ఆప్యాయతలతో పలకరించుకుంటూ ఉప్పొంగిపోయారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. వారితో కలిసి గ్రూప్ ఫొటో తీసుకున్నారు. అలనాటి తీపి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ప్రతి సంవత్సరం ఇలాగే కలిసి పాఠశాల అభివృద్ధికి తోడ్పాటు ఇవ్వాలని తీర్మానించారు.



కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం పటవల జడ్పీ హైస్కూల్లో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

వసంతవాడలో కేంద్ర నోడల్ బృందం పర్యటన

- జలజీవన్ మిషన్ పనుల పరిశీలన
- పథకం అమలుపై గ్రామస్థులతో ఆరా



జలజీవన్ మిషన్ పనులను పరిశీలిస్తున్న కేంద్ర నోడల్ బృందం

ఆత్రేయపురం, జూన్ 2(ఆంధ్రజ్యోతి): కేంద్రం, రాష్ట్రం సంయుక్త ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జలజీవన్ మిషన్ పథకం పనులను కేంద్ర నోడల్ బృందం పరిశీలించింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని 22 మండలాల పరిధిలో ఉన్న ఆవాస ప్రాంతాల్లో జలజీవన్ మిషన్ పథకం ద్వారా చేపడుతున్న పనులను ఈ బృందం క్షుణ్ణంగా పరిశీలించింది. ఆత్రేయపురం మండలం వసంతవాడ గ్రామంలో సోమవారం కేంద్ర నోడల్ అధికారి పూర్ణచంద్రకిషన్, టెక్నికల్ ఆఫీసర్, సాంకేతిక సలహాదారు బి.విశ్వదీప్‌దాస్‌తో పాటు బృందం పర్యటించింది. కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల ప్రజలకు తాగునీరు అందించేందుకు ఏర్పాటు చేసిన పథకంపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. శివారు ప్రాంత ప్రజల తాగునీటి ఇక్కట్లను పరిష్కరించేందుకు ఈ పథకం ద్వారా ఇంటింటికీ తాగునీరు అందుతున్న విధానంపై ఆరాతీశారు. అనంతరం వసంతవాడ పంచాయతీలో సర్పంచ్ గాదిరాజు రామకృష్ణంరాజు అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. జలజీవన్ మిషన్ పథకంలో తాగునీరు అందుతున్న విధానంపై సమీక్షించారు. కార్యక్రమంలో జిల్లా సూపరింటెండెంట్ బి.కృష్ణారెడ్డి, పర్యవేక్షకురాలు భారతి, తూర్పుగోదావరి జిల్లా సూపరింటెండెంట్ వెంకటగిరి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఎస్.రవికుమార్, డి.శ్రీనివాస్, శ్రీనివాసబాబు, పద్మనాభం, ఏఈఈ శ్రీధర్, ఎంపీడీవో వెంకటరామన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీధర్, డిప్యూటీ ఎంపీడీవో చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశానికి నేటి నుంచి ఇంటర్వ్యూలు

ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, కన్వీనర్ వేణుగోపాలవర్మ



కాకినాడలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల

కార్పొరేషన్(కాకినాడ), జూన్ 2(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో 2025-26కు గాను ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు జూన్ 3నుంచి 10వ రకు షెడ్యూల్ ప్రకారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, కన్వీనర్ ఎం.వేణుగోపాలవర్మ తెలిపారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో షెడ్యూల్ ప్రకారం హాజరుకావాలని కోరారు. జూన్ 3న ఉదయం 8గంటల నుంచి మెరిట్ 1నుంచి 80, జీపీఏ 10నుంచి 7.5వరకు. మధ్యాహ్నం 1గంట నుంచి మెరిట్ 81నుంచి 159, జీపీఏ 7.4 నుంచి 6.8 వరకు. 4న ఉదయం మెరిట్ 160 నుంచి 242, జీపీఏ 6.7నుంచి 6.2వరకు, మధ్యాహ్నం మెరిట్ 243 నుంచి 325, జీపీఏ 6.1 నుంచి 5.7 వరకు. 5న ఉదయం మెరిట్ 326 నుంచి 407, జీపీఏ 5.6 నుంచి 5.2 వరకు, మధ్యాహ్నం మెరిట్ 408 నుంచి 484, జీపీఏ 5.1 నుంచి 4.7కి వరకు. 6న ఉదయం మెరిట్ 484 నుంచి 557, జీపీఏ 4.6 నుంచి 4.2 వరకు, మధ్యాహ్నం మెరిట్ 558 నుంచి 634, జీపీఏ 4.1 నుంచి 3.0 వరకు. షెడ్యూల్‌లో మిగిలిపోయిన సీట్ల భర్తీ కోసం జనరల్ కేటగిరీలో జూన్ 9న ఉదయం మెరిట్ 1 నుంచి 159, జీపీఏ 10 నుంచి 6.8 వరకు. మధ్యాహ్నం మెరిట్ 160 నుంచి 325, జీపీఏ 6.7 నుంచి 5.7 వరకు. 10న ఉదయం నుంచి మెరిట్ 326 నుంచి 484, జీపీఏ 5.6 నుంచి 4.7 వరకు, మధ్యాహ్నం మెరిట్ 485 నుంచి 634, జీపీఏ 4.6నుంచి 3.0 వరకు కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. అలాగే సీట్లు రాని, కౌన్సెలింగ్‌కు హాజరుకాని అభ్యర్థులు కూడా 9,10 తేదీల్లో ఇంటర్వ్యూలకు హాజరుకావచ్చని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

ప్రపంచ స్థాయి ఇన్నోవేషన్ చాలెంజ్‌లో
ఫైనల్‌కు చేరిన బీవీసీ విద్యార్థులు

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీని ఉపయోగించి నీటిని శుద్ధిచేయడం, వినియోగించడంపై ప్రాజెక్టు రూపకల్పన



ఫైనల్ పోటీలకు ఎంపికైన భట్లపాలెం బీవీసీ కళాశాల విద్యార్థులు

అమలాపురం రూరల్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మలేషియా దేశంలోని కౌలాలంపూర్ యూకేఎం యూనివర్శిటీలో నిర్వహించే ప్రపంచ స్థాయి ఇన్నోవేషన్ చాలెంజ్ ఫైనల్ రౌండ్ పోటీలకు భట్లపాలెం బీవీసీ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు రూపొందించిన ఫ్రెష్ వాటర్ ఫ్యూచర్స్ ప్రాజెక్టు ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జేవీజీ రామారావు తెలిపారు. క్లీన్ వాటర్ అండ్ శానిటేషన్ విభాగంలో అంతర్జాతీయంగా ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులు ఈ పోటీలు ఏర్పాటు చేశారు. ఆన్‌లైన్‌లో ఇప్పటి వరకు రెండు రౌండ్ల పోటీలు జరగ్గా దేశ వ్యాప్తంగా వెయ్యికి పైగా కళాశాలల నుంచి విద్యార్థులు ప్రాజెక్టులను పోటీల్లో ఉంచారు. రెండు రౌండ్లలోను బీవీసీ కళాశాల విద్యార్థులు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీని ఉపయోగించి నీటిని శుద్ధిచేయడం, వినియోగించడంపై రూపొందించిన ఫ్రెష్ వాటర్ ఫ్యూచర్ ప్రాజెక్టు ఇన్నోవేషన్ చాలెంజ్ ఫైనల్ రౌండ్‌కు చేరుకుంది. కళాశాలకు చెందిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ, మిషన్ లెర్నింగ్ విభాగం విద్యార్థులు వి.మణిశ్రీ, కె.లీల, ఎ.పల్లవి, సి.అశ్వధ ఈ ప్రాజెక్టును రూపొందించారు. ఆగస్టు 22, 23 తేదీల్లో కౌలాలంపూర్‌లోని యూకేఎం యూనివర్శిటీలో ప్రాజెక్టు ప్రజెంటేషన్ కార్యక్రమం నిర్వహించాల్సి ఉందన్నారు. మలేషియాలో జరిగే పోటీలకు హాజరయ్యే విద్యార్థులకు తమవంతు సహాయ సహకారాలు అందించేందుకు కళాశాల యాజమాన్యం నిర్ణయించింది. ప్రాజెక్టు పైలెట్‌గా యేడిది శర్మ వ్యవహరించగా కోఆర్డినేటర్‌గా బీవీ సతీష్, మెంటర్‌లుగా వంశీరామ్, భవానీ, అంబాసిడర్‌గా విజయ్‌సూర్య వ్యవహరించారు. ఫైనల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను బీవీసీ కళాశాల యాజమాన్యం ప్రత్యేకంగా అభినందించింది.

జేఈఈ అడ్వాన్స్డ్ ఫలితాల్లో తిరుమల ప్రతిభ



ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులతో చైర్మన్ నున్న తిరుమలరావు

రాజమహేంద్రవరం రూరల్ జూన్ 2(ఆంధ్రజ్యోతి): జేఈఈ అడ్వాన్స్ -2025 ఫలితాల్లో రాజమహేంద్రవరం తిరుమల విద్యాసంస్థల విద్యార్థులు జాతీయ స్థాయిలో ర్యాంక్‌లు సాధించి సత్తా చాటారు. సోమవారం విడుదల చేసిన ఈ ఫలితాల్లో తిరుమల ఐఐటీ అండ్ మెడికల్ అకాడమీ విద్యార్థి కె.ప్రణీత్ ఆలిండియా స్థాయిలో 2వ ర్యాంక్ సాధించాడు. జాతీయ స్థాయిలో కోటిపల్లి యశ్వంత్ సాత్విక్ 8వ ర్యాంక్ సాధించాడు. ఈ సందర్భంగా తిరుమల విద్యాసంస్థల్లో జరిగిన విలేకరుల సమావేశంలో చైర్మన్ నున్న తిరుమలరావు మాట్లాడారు. 2, 8 ర్యాంక్‌లతో పాటు డి.హర్ష వర్షిత్ 12వ ర్యాంక్, ఎం సుమంత్ దొర 38వ ర్యాంక్, మజ్జి పురుషోత్తమ రావు 39వ ర్యాంక్, కె.అభినవ్ 42 ర్యాంక్, జి సుజోష్ రాజు 43వ ర్యాంక్, జి.అఖిల్ సాయి 45వ ర్యాంక్, తుమాటి పూజిత అఖిల్ రాజ్ కుమార్ 85వ ర్యాంక్, ఆర్.చరణ్ తేజ 86వ ర్యాంక్, కప్పల వెంకట రామవినీష్ 127వ ర్యాంక్, పాతపాటి వెంకట వివేక్ వర్మ 132వ ర్యాంక్, మువ్వల లిఖిత 137వ ర్యాంక్ సాధించారని తెలిపారు. ప్రధాన ర్యాంక్‌లతో పాటు 165, 174, 193, 195, 226, 231, 238, 243, 245, 246, 270, 272, 275, 276 ర్యాంక్‌లు సాధించారన్నారు. వెయ్యి లోపు 69 మంది, 3వేల లోపు 201 మంది, ఐదువేల లోపు 333 మంది, పదివేల లోపు 456 మంది ర్యాంక్‌లు సాధించారన్నారు. ఈ ఏడాది 260 మందికి పైబడి ఐఐటీ సీట్లు సాధిస్తారని చెప్పారు. ఉత్తమ ర్యాంక్‌లు సాధించిన విద్యార్థులను అకడమిక్ డైరెక్టర్ ఐ.సతీష్‌బాబు, ప్రిన్సిపాల్ శ్రీహరిలతో కలిసి తిరుమలరావు అభినందించారు.

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అవుతా!



జేఈఈ అడ్వాన్స్డ్-2025 ఫలితాల్లో జాతీయ స్థాయిలో రెండో ర్యాంక్ సాధించడం ఆనందంగా ఉంది. తిరుమల ఐఐటీ అండ్ మెడికల్ అకాడమీలో ఇచ్చిన అత్యుత్తమ బోధన వల్లే ఈ ర్యాంక్ సాధించడం సాధ్యమైంది. తల్లిదండ్రుల ప్రోత్సాహం, తిరుమల విద్యాసంస్థల ఫ్యాకల్టీ బోధనతో ర్యాంక్ సాధ్యమైంది. నేను సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అవుతాను.

-ప్రణీత్, 2వ ర్యాంకర్.

ఐఐటీలో సీటు కోసం చదివాను



అలిండియా స్థాయిలో 8వ ర్యాంక్ సాధించడం చాలా సంతోషాన్ని ఇచ్చింది. ఐఐటీలో సీటు సాధించాలనే పట్టుదలతో చదివాను. టైం టేబుల్‌కు అనుగుణంగా చైర్మన్ తిరుమలరావు ప్రోద్బలంతో ర్యాంక్ సాధ్యమైంది.

-కేవై సాత్విక్, 8వ ర్యాంకర్.

'ఆదిత్య' విద్యార్థుల హవా

కాకినాడ రూరల్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో కాకినాడ ఆదిత్య విద్యార్థుల హవా కొనసాగింది. ఎం. మీసాల జయచంద్ర అఖిలభారత ఓపెన్ కేటగిరీలో 169వ ర్యాంకుతో పాటు పి. ఆదిత్య అభిషేక్ 257, జి.శ్రీరామ శశాంక్ 281, వై.శుభశ్రీవల్లీ ఆత్రేయి 296వ ర్యాంకు, టి.సాత్విక్ 849, సీహెచ్ సాయి వర్షిత్ 893వ ర్యాంకు, ఆలిండియా ఓపెన్ కేటగిరీలో 300లోపు నలుగురు విద్యార్థులు జాతీయస్థాయి ర్యాంకులు సాధించినట్టు ఆదిత్య కార్యదర్శి ఎస్.కృష్ణదీపక్ రెడ్డి తెలిపారు. అలాగే వివిధ కేటగిరీల్లో 16, 24, 27, 41, 65, 128, 256, 281, 296, 372, 381, 399, 406, 465, 495 ర్యాంకులు పొందారన్నారు. అఖిల భారత స్థాయిలో అన్ని కేటగిరీల నుంచి 100 లోపు ఐదుగురు, 500లోపు 15 మంది, 1000 లోపు 25 మంది, 3000లోపు 62, 5000లోపు 82 మంది ఆదిత్య విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించినట్టు తెలిపారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ ఎన్.శేషారెడ్డి, హాస్టల్స్ డైరెక్టర్ లక్ష్మీరాజ్యం, డైరెక్టర్లు సుగుణ, శృతి, లక్ష్మీకుమార్, ప్రిన్సిపాల్ మొయినా అభినందించారు.



ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులతో ఆదిత్య కార్యదర్శి కృష్ణదీపక్ రెడ్డి

దేవిడ్ జాన్సన్‌కు 1353వ ర్యాంక్



తుని రూరల్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో ఎస్సీ కేటగిరి విభాగంలో దేవి డేవిడ్ జాన్సన్ ఆలిండియా 1353వ ర్యాంక్ సాధించి సత్తా చాటినట్టు శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయ్‌ప్రకాష్ తెలిపారు. జేఈఈ అడ్వాన్స్‌డ్ కోసం ఇస్తున్న స్పెషల్ కోచింగ్ ద్వారా ఈ విద్యార్థి ఈ ర్యాంక్ కైవసం చేసుకున్నట్టు తెలిపారు. విద్యార్థిని విద్యాసంస్థల అధినేత సీహెచ్‌వీకే నరసింహారావు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

కేంద్ర పరిశోధన ప్రాజెక్టుకు ఎంపికలు



అమలాపురం, జూన్ 2(ఆంధ్రజ్యోతి): అల్లవరం మండలం ఓడలరేవు బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ స్థాయి కేంద్ర పరిశోధనా ప్రాజెక్టుకు ఎంపిక జరిగింది. కోనసీమ వైభవం-సమకాలిన అన్వయం అంశంపై భారత జ్ఞాన పరంపర విభాగం ఆధ్వర్యంలో అధ్యయనం జరిగింది. ఈ ప్రాజెక్టు సహ పరిశోధకులుగా అయ్యగారి నాగేశ్వరరావు, శ్రీపాద రామకృష్ణ పర్యవేక్షణలో విద్యార్థులు ఆరు నెలల పాటు అధ్యయనం నిర్వహించారు. కోనసీమ జీవనశైలిలో ప్రతిబింబించే మానవీయత నైపుణ్యాలు, ధార్మికతలు, ఆధునిక సమాజంలో కూడా ఎలా ప్రాముఖ్యతను సంతరించుకుంటున్నాయో ఈ పరిశోధనలో విశ్లేషించనున్నారు. ఈ అధ్యయన ఫలితాలను భారత జ్ఞాన పరంపర విభాగం ద్వారా కేంద్ర ప్రభుత్వానికి నివేదిక రూపంలో సమర్పించనున్నారు. ప్రాజెక్టుకు ఎంపికైన వారిని బీవీసీ అధినేత బోనం కనకయ్య, చైర్మన్ బోనం కృష్ణ సతీష్, మేనేజ్‌మెంట్ సభ్యుడు బోనం కనకదుర్గ, ప్రిన్సిపాల్ మహేశ్వర్ అభినందించారు.

మరిడమ్మకు మఖ నక్షత్ర పూజలు



పెద్దాపురం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మఖ నక్షత్రం సందర్భంగా కాకినాడ జిల్లా పెద్దాపురంలో మరిడమ్మ తల్లికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గర్భాలయంలోని మూలవిరాట్‌కు పంచామృతాలతో అభిషేకం నిర్వహించి పుష్పాలతో విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. దేవస్థానం సహాయ కమిషనర్ కె.విజయలక్ష్మి, ఆలయ సిబ్బంది రమణ, అసాదులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ.. ఏది సామీ!

ఏం తినాలి.. ఎట్లా బతకాలి

- విలీన మండలాల్లో 2నెలలుగా ఉపాధి హామీ శ్రామికులకు అందని వేతనాలు
- ఆర్థిక ఇబ్బందులతో గగ్గోలు
- పనుల కోసం తెలంగాణ వైపు అడుగులు



చలెంపాలెంలో ఉపాధి పనులు చేస్తున్న గిరిజనులు

ఉపాధిహామీ శ్రామికులు గత రెండు నెలలుగా పనులు చేసినా ఇంత వరకు వేతనాలు అందకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. రెక్కాడితే కానీ డొక్కాడని వారికి పనులకు చెల్లింపులు లేకపోవడంతో పూట గడవని పరిస్థితి ఏర్పడింది. నెలలుగా ఉపాధి పనులు చేస్తున్నప్పటికీ వేతన బిల్లులు రావపోవడంతో ఏం తినాలి... ఎట్లా బతకాలి అంటూ వాపోతున్నారు.

ఎటపాక, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంతంలోని నాలుగు విలీన మండలాల్లో 28,489 మంది ఉపాధి జాబ్ కార్డులు కలిగి ఉన్నారు. ప్రస్తుతం 52,135 శ్రామికులు పనులు చేస్తున్నారు. ఉపాధి పనుల్లో బాగంగా నీటి కుంటలు, ఇంకుడుగుంతలు, భూమి చదును, సరిహద్దు కందకాలు, పశువుల నీటి తొట్టెలు, పంట కాల్వలు తదితర పనులు నిర్వహిస్తున్నారు. ఉపాధి హామీ చట్టం ప్రకారం పనులు చేసిన 15 రోజుల్లో శ్రామికులకు వేతనాలు చెల్లించాల్సి ఉంటుంది. కానీ పనులు చేసి రెండు నెలలు పూర్తవుతున్నా ఇప్పటివరకు వేతనాలు చెల్లించని దుస్థితి ఉంది.

రూ.9 కోట్ల బకాయిలు..

గత 2 నెలలుగా పనులు చేసిన ఉపాధిహామీ శ్రామికులకు వేతనాలు జమ అవడంలేదు. అయితే మార్చి వరకు శ్రామికులకు వేతనాలు ఖాతాల్లో జమ అయ్యాయి. ఏప్రిల్, మేనెలల్లో చేసిన పనులకు వేతన బకాయిలు జమకావాల్సి ఉంది. ఒక్కో కుటుంబానికి రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు బకాయిలు రావాల్సి ఉంది. 2 నెలలుగా వేతనాలు విడుదల కాకపోవడంతో శ్రామికులు ఆర్థిక ఇబ్బందులతో అల్లాడిపోతున్నారు. విలీన మండలాల్లో రెండు నెలల పనులకు గాను ఉపాధి శ్రామికులకు మొత్తం సుమారు రూ.9.కోట్ల వరకు బకాయి వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి.

వేసవి అలవెన్స్ నిలిపివేత..

వేసవిలో ఉపాధి పనులు చేయడం కష్టంగా ఉంటుందని భావించిన ప్రభుత్వాలు గతంలో ఉపాధి పనుల సమయాల్లో ఫిబ్రవరి నెలలో 20శాతం, మార్చిలో 25శాతం, ఏప్రిల్, మే నెలల్లో 30శాతం, జూన్‌లో 20 శాతం వరకు పనుల పరిమాణం తగ్గించి 100 శాతం పనికి వేతనం అందించేవారు. వేసవిలో నెల గట్టిగా ఉండడంతో పని తక్కువ జరిగినా వేసవి అలవెన్స్‌తో కలిపి వేతనం అందించేవారు. అయితే ఈ ఏడాది శ్రామికులకు వేసవిలో ఇవ్వాల్సిన అలవెన్స్‌ను నిలిపివేశారు. దాంతో ఈ ఏడాది వేతనాలు తగ్గే అవకాశంఉందని గగ్గోలు పెడుతున్నారు.

పనుల కోసం వలసలు..

ఈ ఏడాది వ్యవసాయ పనులు అంతంత మాత్రంగా ఉండడం, ఉపాధి పనుల వేతనాలు సకాలంలో రాకపోవడంతో చాలామంది ఇటీవల తెలంగాణలోని భద్రాచలం, మణుగూరు, కొత్తగూడెంకు వలస వెళ్తున్నారు. అక్కడ తాపీ పనులతోపాటు హోటళ్లు, షాపుల్లో రోజు వారి పనులకు వెళ్లి వస్తున్నారు. గ్రామాల్లో పనులు లేకపోవడంతో ఈ దుస్థితి వచ్చింది.

8 వారాల వేతనాలు రావాలి



8 వారాల నుంచి పనులు చేస్తున్నా ఇప్పటి వరకు వేతనాలు జమ అవ్వలేదు. ఇంట్లో పూట గడవడం కష్టంగా మారుతోంది. వేసవిలో ఇంకా ఏం పనులు చేయడానికి లేవు. బకాయి వేతనాలు త్వరగా చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

చిచ్చడి భద్రయ్య, ఉపాధిహామీ శ్రామికుడు, కృష్ణవరం గ్రామం

ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం



ఇప్పటి వరకు వేతనాల సొమ్ములు జమ కాలేదు. ఒక్కో కుటుంబానికి రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు వేతన బకాయిలు రావాల్సి ఉంది. వేతనాలు రాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.

నూప బుల్లెమ్మ, ఉపాధిహామీ శ్రామికురాలు, విస్సాపురం గ్రామం



ప్రపంచసుందరిని కలిసిన వేళ..

ప్రపంచసుందరి-2025గా ఎంపికైన సుచాత చువాంగ్‌శ్రీ సోమవారం రాజ్‌భవన్‌లో జరిగిన తేనీటి విందు కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా మర్యాదపూర్వకంగా కలుసుకున్న యశోద హాస్పిటల్ ఆర్థోపెడిక్ వైద్యులు డా.టి.దశరథరామారెడ్డి, డా.సంజోగ్‌మాథుర్ (యూఎస్‌ఏ)

నగలు, నగదుతో పరారైన వ్యక్తి అరెస్టు

217 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం

అమలాపురం టౌన్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): నమ్మకంగా వ్యాపారి వద్ద పనిచేస్తూ బంగారు ఆభరణాలు, నగదుతో ఉడాయించిన వ్యక్తిని సోమవారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపరుచగా రిమాండ్ విధించినట్టు పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం పట్టణంలోని జీకే రెస్టారెంట్ యజమాని గుంగమళ్ల కాసుబాబు వద్ద గత ఐదేళ్లుగా అయినవిల్లి మండలం క్రాప గ్రామానికి చెందిన కంతేటి రాజా పనిచేస్తున్నాడు. గత నెల 26న ముమ్మిడివరంలోని బ్యాంకులో తాకట్టులో ఉన్న నగదును విడిపించుకుని రావాలని రాజాకు నగదు ఇచ్చి పంపించాడు. 322 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.2.25లక్షల నగదుతో రాజా పరారు కావడంతో యజమాని కాసుబాబు 27వ తేదీన పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సోమవారం సావరం రోడ్డులో అనుమానాస్పదంగా తిరుగుతున్న కంతేటి రాజాను అరెస్టుచేసి అతడి వద్ద నుంచి రూ.6.53లక్షల విలువైన 217 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్టు సీఐ తెలిపారు. రాజాను కోర్టులో హాజరుపరుచగా రిమాండ్ విధించినట్టు సీఐ వీరబాబు పేర్కొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి జైలు, జరిమానా

కాకినాడ క్రైం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 24 మందికి జైలు, జరిమానా విధిస్తూ కాకినాడ 3వ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ డి.శ్రీదేవి సోమవారం తీర్పు చెప్పారు. కాకినాడ ట్రాఫిక్-1, 2 సీఐలు ఎన్.రమేష్, డి.రామారావు సిబ్బందితో ఆదివారం రాత్రి డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. మోతాదు దాటి మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిని బ్రీత్ ఎనలైజర్లతో పరీక్షించగా 24 మంది పట్టుబడ్డారు. వారిని సోమవారం కోర్టులో హాజరుపరిచారు. ఒకరికి 7 రోజులు, మరో 8 మందికి 2రోజులు చొప్పున జైలు శిక్ష, 15 మందికి ఒక్కొక్కరికి రూ.10వేలుచొప్పున జరిమానా విధించినట్టు సీఐలు చెప్పారు.

మనస్తాపంతో రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య



ఈశ్వరరావు (ఫైల్)

తుని రూరల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మనస్తాపంతో రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కాకినాడ జిల్లా తుని రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం... కాకినాడ జిల్లా పిఠాపురానికి చెందిన అమలకంటి ఈశ్వరరావు (31) పిఠాపురం మాధవపట్నం రైల్వే గేటు వద్ద గుర్తుతెలియని రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. అతడు కాకినాడ పోర్టులో ఔట్‌సోర్సింగ్ కార్మికుడిగా పనిచేస్తున్నాడని, అయితే అప్పు ఇచ్చిన వారు ఇంటికి వచ్చి దురుసుగా ప్రవర్తించడంతో మనస్తాపానికి చెందిన ఈశ్వరరావు ఇంటి నుంచి రైల్వే గేటు వద్ద చేరుకుని ఆత్మహత్యకు పాల్పడినట్టు ఎస్‌ఐ తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రైల్వే పోలీసులు తెలిపారు.

ఏసీబీ వలకు చిక్కారు

రూ. లక్ష లంచం తీసుకుంటూ పట్టుబడిన సబ్ ట్రెజరీ అధికారి, సీనియర్ అసిస్టెంట్



ఏసీబీకి చిక్కిన వంశీ కళ్యాణ్, సామ్యూల్



వివరాలు వెల్లడిస్తున్న ఏసీబీ డీఎస్పీ నాగేశ్వరరావు

చింతూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): చింతూరు ఉప ఖజానా కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న సబ్ ట్రెజరీ అధికారి జీడీ.వంశీకళ్యాణ్, సీనియర్ అసిస్టెంట్ ఎన్‌వీఎంఎస్.సామ్యూల్ సోమవారం ఏసీబీ వలకు చిక్కారు. ఈ మేరకు విశాఖపట్నం రేంజ్ ఏసీబీ డీఎస్పీ బీవీఎస్ నాగేశ్వరరావు వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం నరసింహాపురం (బాలురు) ఆశ్రమ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా ఎస్.పకీర్ దొర విధులు నిర్వర్తిస్తున్నారు. కాగా పకీర్ దొరకు చెందిన పది సంవత్సరాల ఇంక్రిమెంట్లు ఏరియర్స్ బిల్లులు మొత్తం రూ.11,54,254 చెల్లింపు ప్రక్రియ ఆమోదించే క్రమంలో లంచంగా రూ.2 లక్షలు ఎస్టీవో (సబ్ ట్రెజరీ అధికారి) డిమాండ్ చేశాడు. ఈ మేరకు పకీర్ దొర ఏసీబీ అధికారులను ఆశ్రయించగా వారు రంగంలోకి దిగారు. ముందుగా రూ.1లక్ష అడ్వాన్సుగా చెల్లించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇందులో భాగంగా నేరుగా కార్యాలయంలోనే పకీర్ దొర నుంచి సబ్ ట్రెజరీ అధికారి సూచన మేరకు సీనియర్ అసిస్టెంట్ రూ.1లక్ష లంచం తీసుకుంటుండగా పట్టుకున్నట్టు డీఎస్పీ పేర్కొన్నారు. కేసు నమోదు చేయడంతో పాటు నిందితులను అదుపులోకి తీసుకున్నామన్నారు. దాడిలో ఏసీబీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణరావు, శ్రీనివాసరావు, వెంకట్రావు తదితరులు ఉన్నారు.

ఆలయ కోనేరులో స్నానానికి దిగి తండ్రి కొడుకుల మృతి



మృతదేహాలను పరిశీలిస్తున్న జగ్గంపేట సీఐ శ్రీనివాస్

కాకినాడ జిల్లా తాళ్లూరులో ఘటన

గండేపల్లి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ఆలయ కోనేరులో స్నానానికి దిగి తండ్రి కొడుకులు మృతిచెందారు. గండేపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కాకినాడ జిల్లా గండేపల్లి మండలం తాళ్లూరు గ్రామంలో జియ్యన్నమఠంలో వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న కోనేరులో సోమవారం మండలంలో బొర్రంపాలెం గ్రామానికి చెందిన తండ్రి కొడుకులు సాగినల్ల బాబు(49), సాయి సంజయ్ శ్రీరామ్(19) స్నానానికి దిగి ప్రమాదవశాత్తు మృతిచెందారు. తొండంగి మండలం వలసపాకలు చెందిన తమ బంధువులు మృతి చెందడంతో పరామర్శ కెళ్లి తిరిగి వస్తూ సాయంత్రం కోనేరులో స్నానానికి దిగగా ఈ ఘటన జరిగింది. వారిని గుర్తించిన స్థానికులు రక్షించే ప్రయత్నం చేసిన ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు సమాచారం ఇవ్వడంతో జగ్గంపేట సీఐ వైఆర్ కె.శ్రీనివాస్, గండేపల్లి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అయితే తండ్రి కొడుకులు మృతి వార్త తెలియడంతో బొర్రపాలెంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఇంటికి పెద్ద దిక్కును కోల్పోయామని కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. సాయి సంజయ్ శ్రీరామ్ వైజాగ్‌లో బీటెక్ చదువుకుంటున్నాడని తెలిసింది.

5 కిలోల గంజాయితో వ్యక్తి అరెస్ట్



గంజాయితో పట్టుబడిన వ్యక్తి

తుని రూరల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): 5 కిలోల గంజాయితో కాకినాడ జిల్లా తుని నర్సీపట్నం బస్టాండ్ సమీపంలో తమిళనాడుకు వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామని సీఐ గీతా రామకృష్ణ వెల్లడించారు. తమిళనాడుకు చెందిన పాండ్య అనే వ్యక్తి నర్సీపట్నం ఏజెన్సీ ప్రాంతం నుంచి గంజాయి కొనుగోలు చేసి తమిళనాడుకు తరలిస్తుండగా సోమవారం అరెస్ట్ చేసి అతడి నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచనున్నట్టు చెప్పారు.

2750 కిలోల పీడీఎస్ బియ్యం స్వాధీనం

అమలాపురం రూరల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): చౌకధరల దుకాణాల నుంచి అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్నారని సోమవారం తెల్లవారుజామున తాలూకా పోలీసులకు అందిన సమాచారంతో ఎస్‌ఐ వై.శేఖర్‌బాబు ఆధ్వర్యంలో సిబ్బంది అప్రమత్తమై రేషన్ బియ్యాన్ని వాహనంతో సహా స్వాధీనం చేసుకున్నారు. కోనసీమ జిల్లా బండారులంకలోని రెండు చౌకధరల దుకాణాల నుంచి నడిపూడికి చెందిన ఎ.సత్యనారాయణ 2750 కిలోల రేషన్ బియ్యాన్ని 55 మూటలుగా ప్రత్యేక వాహనంలో వేసుకుని తరలిస్తుండగా గ్రామ శివారున ఎస్‌ఐ శేఖర్‌బాబు ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు. సత్యనారాయణతో పాటు చౌకడిపో డీలర్లు ఎస్.మాణిక్యాలరావు, కె.సుబ్రహ్మణ్యంలపై కేసు నమోదు చేశామని తెలిపారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం మూటలు

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్

రూ.1,10,000 విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్న చింతూరు పోలీసులు



పట్టుబడిన నిందితులతో చింతూరు పోలీసులు

చింతూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): గంజాయి తరలిస్తూ ఇద్దరు నిందితులు పట్టుబడ్డారు. చింతూరు ఎస్‌ఐ పి.రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరుకు చెందిన చింతల దురాప్రసాద్, పిల్లి లీలాకృష్ణ ఒడిస్సాలోకి మల్కనగిరిలో 22 కిలోల గంజాయి కొనుగోలు చేశారు. వయా చింతూరు మీదుగా ద్విచక్రవాహనం ద్వారా గంజాయి తరలించే యత్నం చేశారు. కాగా సోమవారం చేపట్టిన వాహన తనఖీల్లో భాగంగా గంజాయి తరలిస్తూ పట్టుబడ్డారు. కాగా మరో వ్యక్తి పరారీలో ఉన్నట్టు ఎస్‌ఐ తెలిపారు. పట్టుబడిన ఇద్దరిపై కేసు నమోదు చేయడంతో పాటు వారు వినియోగించిన ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ తెలిపారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.1,10,000 వరకు ఉంటుందని చెప్పారు.

పరీక్షల్లో ఫెయిలయ్యా.. ఒంటరితనం ఫీలవుతున్నా..

ఉరేసుకుని బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య

సూసైడ్ నోట్ స్వాధీనం

రాజానగరం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజానగరం సమీపంలోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ఫస్ట్ ఇయర్ చదువుతున్న విద్యార్థిని సోమవారం కళాశాల వసతి గృహంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. నెల్లూరు జిల్లా నర్సాపురం మండలం గుడ్లూరు గ్రామానికి చెందిన పరుచూరి ప్రగతి (19) బీటెక్ చదువుతోంది. సెకండ్ సెమ్ తరగతులు సోమవారం నుంచి ప్రారంభం కావడంతో ఆదివారం విద్యార్థిని స్వగ్రామం నుంచి కళాశాల వసతి గృహానికి చేరుకుంది. మొదటి సెమ్‌లో 4 పరీక్షల్లో ఫెయిల్ అయ్యానని, దీంతో మానసికంగా ఆందోళనకు లోనవుతూ, ఒంటరితనం ఫీలవుతున్నానని, తల్లిదండ్రులను జాగ్రత్తగా ఉండమని రాసి ఉన్న సూసైడ్ నోట్‌ను సంఘటనా స్థలంలో స్వాధీనం చేసుకున్నామని సీఐ ప్రసన్న వీరయ్యగౌడ్ తెలిపారు. పక్కగదిలో ఉంటున్న స్నేహితులు తరగతులకు వెళ్లగా ప్రగతి.. బయటకు కనిపించకుండా దుప్పటి అడ్డుగా ఏర్పాటు చేసుకుని దుస్తులు ఆరబెట్టుకునే హుక్కుకు చున్నీని బిగించుకుని ఉరేసుకున్నట్టు పోలీసులు తెలిపారు. విద్యార్థిని తల్లిదండ్రులకు సమాచారం అందించామని, కేసు నమోదు చేశామని వారు పేర్కొన్నారు.

ఆర్‌ఎంసీకి చిరంజీవినీకుమారి భౌతిక కాయం

ఊరేగింపుగా తీసుకెళ్లి అప్పగింత

ప్రముఖుల సంతాపం



చిరంజీవినీకుమారి భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కొండబాబు



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నానాజీ, మాజీ మంత్రి వేణు

కాకినాడ రూరల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సాహితీవేత్త, విద్యావేత్త డాక్టర్ పి.చిరంజీవినీకుమారి భౌతికకాయాన్ని సోమవారం పలువురు ప్రముఖులు సందర్శించి కుటుంబ సభ్యులకు ప్రగాఢమైన సానుభూతి తెలిపారు. కాకినాడ ప్రతాప్‌నగర్‌లోని ఆమె నివాసం నుంచి పూర్వ విద్యార్థులు, అభిమానులు, ప్రజాప్రతినిధుల సందర్శనార్థం కాకినాడ సామర్లకోట రోడ్డులోని ఇంద్రపాలెం లాకుల వద్ద గల ఐడియల్ కళాశాలకు ఉదయం 11గంటలకు తీసుకురాగా పలువురు ప్రజాప్రతినిధులు, పూర్వ విద్యార్థులు ఆమె భౌతికకాయానికి పూలమాలలతో నివాళులర్పించారు. అనంతరం చిరంజీవినీకుమారి కోరిక మేరకు వైద్య విద్యార్థుల పరిశోధన నిమిత్తం కాకినాడ రంగరాయ వైద్యకళాశాలకు ఊరేగింపుగా కళాశాల నుంచి తీసుకువెళ్లి అప్పగించారు. ఆమె మృతికి సంతాపం తెలిపినవారిలో ఎమ్మెల్యేలు వనమాడి కొండబాబు, పంతం నానాజీ, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, కటకంశెట్టి బాబీ, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణు, మాజీ ఎంపీలు వంగా గీత, మిడియం బాబూరావు, మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, జేఎన్టీయూకే మాజీ వీసీలు జీవీఆర్ ప్రసాదరాజు, కేవీఎస్‌జీ మురళీకృష్ణ, మాజీ రిజిస్ట్రార్ వి.రవీంద్ర, ప్రగతి విద్యాసంస్థల చైర్మన్ పి.కృష్ణారావు, కేఎస్‌పీఎల్ సీవోవో ఎం.మురళీధర్, దామెర మురళి, కుడా మాజీ చైర్మన్ చంద్రకళాదీప్తి, జడ్పీ మాజీ చైర్మన్ దున్నా జనార్దనరావు, డాక్టర్ స్టాలిన్, ఆలపాటి శ్రీనివాస్, వక్కలంక రామకృష్ణ, డాక్టర్ ఎన్ఎస్‌మూర్తి, రంజిత్, సత్యనారాయణ, కృష్ణంరాజు, వర్మ, సుబ్బారావు కళాశాల పూర్వ విద్యార్థులు, పూర్వ, ప్రస్తుత అధ్యాపకులు, సాహిత్యాభిమానులు ఉన్నారు.

సత్యదేవుడికి జన్మనక్షత్ర పూజలు



ప్రత్యేక అలంకరణలో స్వామి,అమ్మవార్లు

అన్నవరం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): రత్నగిరి వాసుడైన సత్యదేవుడి జన్మనక్షత్రం మఖ సందర్భంగా ప్రధానాలయంలో మూలవరులకు సోమవారం వేకువఝామున పంచామృతాభిషేకాలు, ప్రత్యేకపూజలు ఘనంగా జరిగాయి. 2గంటలకు స్వామి,అమ్మవార్లను సుప్రభాతసేవతో మేల్కొలిపి అభ్యంగనస్నానమాచరింప చేశారు. మహాన్యాసపూర్వక రుద్రాభిషేకాల అనంతరం పంచామృతాలతో అభిషేకించి నూతన పట్టువస్త్రాలను ధరింపచేశారు. 9గంటలకు యాగశాలలో ఆయుష్యహోమానికి పండితులు గణపతిపూజతో శ్రీకారం చుట్టారు. 11గంటలకు పవిత్ర హోమగుండంలో సుగంధ ద్రవ్యాలను అర్పించి పూర్ణాహుతి గావించారు. చతుర్వేదపండితులు వేదాశీర్వచనాలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలందజేశారు.



ఆయుష్యహోమం నిర్వహిస్తున్న పండితులు

అరుణాచలేశ్వరుడికి మామిడి రసాభిషేకం

ప్రత్తిపాడు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం రాచపల్లి అడ్డురోడ్డు వద్ద అపీత కుంచాంబ సమేత అరుణాచలేశ్వర స్వామి ఆలయంలో సోమవారం అరుణాచలేశ్వరుడికి 1313 మామిడి పండ్లరసంతో అభిషేకం నిర్వహించారు. తొలుత రుద్రాభిషేకం, పాలాభిషేకం కూడా నిర్వహించారు.



సీహెచ్‌సీలో సిబ్బంది లేక

ఎన్టీఆర్ వైద్య సేవలు బంద్

▸ డిప్యూటేషన్‌పై జిల్లా కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగి

▸ నిలుపదల చేయాలని సూపరింటెండెంట్‌కు వినతి



పి.గన్నవరం సీహెచ్‌సీలో ఎన్టీఆర్ వైద్యసేవ సిబ్బంది లేకపోవడంతో మూసివేసిన ఛాంబర్

పి.గన్నవరం, జూన్ 2(ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం సామాజిక ఆరోగ్య కేంద్రం(సీహెచ్‌సీ) సమీప లంక ప్రాంతాల ప్రజలకు కార్పొరేట్‌స్థాయి ఆసుపత్రులకు దీటుగా వైద్య సేవలు అందిస్తున్నారు. ఈ క్రమంలోనే గైనిక్, ఆర్థోపెడిక్ సంబంధించిన వైద్యులు నిత్యం అందుబాటులో ఉండటంతో రోగుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఈ క్రమంలోనే ఎన్టీఆర్ వైద్యసేవలకు రోగుల సంఖ్య పెరిగింది. ఈ క్రమంలోనే ఎన్టీఆర్ వైద్యసేవల విభాగంలో రోగుల రద్దీనిబట్టి ఇద్దరు ఉద్యోగులను డీఈలుగా ఏర్పాటుచేశారు. 2020నుంచి 2023 వరకూ ఇద్దరు ఉద్యోగులు విధులు నిర్వహించగా జిల్లాలు ఏర్పాటు క్రమంలో ఓ ఉద్యోగిని డిప్యూటేషన్‌పై డీసీహెచ్‌ఎస్ కార్యాలయానికి పంపించారు. ఆ ఉద్యోగితోపాటు రికార్డు అసిస్టెంటుగా పనిచేస్తున్న మరో ఉద్యోగిని సైతం అదే కార్యాలయానికి సీహెచ్‌సీ నుంచి తీసుకువెళ్లారు. దీంతో అప్పటి నుంచి ఎన్టీఆర్ వైద్య సేవల విషయంలో ఒక్కరే ఉద్యోగి కావడంతో ఇబ్బందిగా మారింది. ఇటీవలే ఏర్పడిన ఆసుపత్రి కమిటీ దృష్టికి ఈ విషయం రావడంతో వారంరోజుల క్రితం డిప్యూటేషన్‌పై వెళ్లిన ఉద్యోగులను తిరిగి రప్పించాలని కోరుతూ సూపరింటెండెంట్ రాఘవేంద్రరావుకు కమిటీ సభ్యులు వినతిపత్రాన్ని అందించారు. అలాగే సోమవారం ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మిని కూడా డిప్యూటేషన్‌పై వెళ్లిన ఉద్యోగులను తిరిగి తీసుకురావాలని, ఎన్టీఆర్ వైద్య సేవలపై ఫిర్యాదులు వచ్చాయని సూపరింటెండెంట్‌కు వివరించారు. డిప్యూటేషన్‌పై వెళ్లిన ఉద్యోగులను తీసుకువస్తే ఎన్టీఆర్ వైద్యసేవలు పూర్తిస్థాయిలో అందుతాయని వినతిపత్రం రూపంలో సూపరింటెండెంట్‌కు అందించారు. ఇదిలావుండగా ఉన్న ఒక్క ఉద్యోగి కూడా వ్యక్తిగత సెలవుపై వెళ్లడంపై ఎన్టీఆర్ వైద్యసేవలు అందక రోగులు ఇబ్బందులు పడ్డారు. ఉన్నతాధికారులు కల్పించుకుని డిప్యూటేషన్‌పై వెళ్లిన ఉద్యోగులు వెంటనే ఆసుపత్రికి రప్పించాలని ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులతోపాటు రోగులు కోరుతున్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఉపాధిహామీ కూలీలు

ఉపాధిహామీ బకాయిల కోసం ధర్నా

● ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిరసన

అమలాపురం టౌన్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం వేతన బకాయిల తక్షణం చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శ్రామికులు, వ్యవసాయ కార్మికులు సోమవారం కలెక్టరేట్ ఎదుట పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారెం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఏడు వారాలుగా ఉపాధి కూలీలు పనులు చేస్తున్నా ఇంతవరకు ప్రభుత్వం ఒక్కరోజు వేతనం కూడా చెల్లించలేదన్నారు. జిల్లాలో ఉపాధి శ్రామికులు రూ.60 కోట్ల మేర బకాయిలు చెల్లించాల్సి ఉన్నందున తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కూలీల పనిదినాలు 200 రోజులకు పెంచాలని, రోజుకు రూ.600 వేతనం చెల్లించాలని నినాదాలు చేశారు. రెండు పూటలా మస్టర్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టరేట్‌లో అందజేశారు. కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పీతల రామచంద్రరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు పచ్చిమాల శివ, జి.దైవకృప తదితరులు పాల్గొన్నారు.

'పేదల సొంతింటి కల సాకారం చేయాలి'



అమలాపురం తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

అమలాపురం రూరల్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): పేదల సొంత ఇంటి కలను సాకారం చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ జిల్లా కార్యదర్శి కొప్పుల సత్తిబాబు ఆధ్వర్యంలో అమలాపురం తహశీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. మంత్రిమండలి సమావేశంలో పల్లెల్లో పేదలకు మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్ల స్థలం మంజూరు చేస్తామని, ఇంటి నిర్మాణానికి రూ.4 లక్షలు అందిస్తామని ప్రకటించి ఇంత వరకు ప్రభుత్వం ఏవిధమైన చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పేదలకు తక్షణం ఇళ్లపట్టాలు అందించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో మండలకార్యదర్శి కాళ్ల భీమరాజు, నియోజకవర్గ కార్యదర్శి గూడాల వెంకటరమణ, నాయకులు నిమ్మకాయల శ్రీనివాసరావు, కురచ నాగేశ్వరరావు, మట్టపర్తి ప్రసాద్, పనస శ్రీనివాసరావు, భోగిరాజు తదితరులు పాల్గొన్నారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ పలివెల అశోక్ ప్రసాద్‌కు అందజేశారు.

'పంచాయతీ కాంట్రాక్టు సిబ్బందిని రెగ్యులర్ చేయాలి'



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న పంచాయతీ కాంట్రాక్టు సిబ్బంది

అమలాపురం టౌన్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలు మూడు దశాబ్దాలుగా పనిచేస్తున్న కాంట్రాక్టు సిబ్బందిని రెగ్యులర్‌చేసి ఆదుకోవాలని అంబాజీపేట తదితర మండలాలకు చెందిన ట్యాంకు వాచర్లు, ఎవెన్యూవాచర్లు, గేట్‌వాల్ ఆపరేటర్లు, ఎలక్ట్రీషియన్లు కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. రూ.5వేల నుంచి రూ.10వేల వేతనంతో మూడు దశాబ్దాలుగా పనిచేస్తున్నామని కుటుంబాన్ని పోషించుకోలేని దుస్థితిలో ఉన్నామని, కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు కాంట్రాక్టు సిబ్బందిని రెగ్యులర్ చేయాలని కోరారు. పోస్టుగ్రాడ్యుయేషన్, గ్రాడ్యుయేషన్, వివిధ అర్హత గల కాంట్రాక్టు సిబ్బందిని సచివాలయ వ్యవస్థలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కలెక్టర్ కార్యాలయంలో అర్జీ అందించారు. కార్యక్రమంలో పితాని రాంబాబు, సరెళ్ల సూర్యనారాయణ, నేదునూరి వెంకట్రావు, నాగాబత్తుల వెంకటరమణ, పోతుమూడి వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వంతెన నిర్మాణ పనులు సకాలంలో పూర్తిచేయాలి



గడియార స్తంభం సెంటర్‌లో యోగా చేస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

అమలాపురం రూరల్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఈదరపల్లి, నడిపూడిల్లో నిర్మిస్తున్న వంతెనల నిర్మాణ పనులను సకాలంలో పూర్తి చేయాలని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయా వంతెనల నిర్మాణ పనులను నాయకులు, అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. పూర్తి నాణ్యతా ప్రమాణాలతో వంతెనలు నిర్మించాలని ఆదేశించారు. ఆయన వెంట టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, మల్లుల పోలయ్య, అధికారి బాబ్జి, పొలమూరి ధర్మపాల్, ఆర్‌అండ్‌బీశాఖ అధికారులు పాల్గొన్నారు. తొలుత అమలాపురం గడియారస్తంభం సెంటర్‌లో పురపాలక సంఘంఆధ్వర్యంలో నిర్వహించిన యోగాంధ్రలో ఎమ్మెల్యే ఆనందరావు పాల్గొన్నారు.

జేఈఈ అడ్వాన్స్‌లో ర్యాంకులు సాధించిన విద్యార్థులు



జేఈఈలో ర్యాంకులో సాధించిన నారాయణ కళాశాల విద్యార్థులు

అమలాపురం, జూన్ 2(ఆంధ్రజ్యోతి): అమలాపురం పట్టణానికి చెందిన పలువురు విద్యార్థులకు జేఈఈ అడ్వాన్స్ మెయిన్‌లో ర్యాంకులు సాధించారు. స్థానిక నారాయణ కళాశాలలో ఇంటర్మీడియట్ చదివిన రెడ్డి దేవిమీనాక్షికి జేఈఈ అడ్వాన్స్‌లో 19వ ర్యాంకు సాధించి తన ప్రతిభను చాటుకున్నారు. అదే కళాశాలలో చదువుతున్న ఉందుర్తి ప్రజ్ఞకు 3707, కాట్రు మనోజ్‌కు 3443 ర్యాంకులు లభించాయి. వీరిని నారాయణ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు. నారాయణ కళాశాల డీజీఎం కృష్ణ, డీన్ సురేష్, ఏజీఎం ప్రసాద్, ఏవో ఆనంద్ విద్యార్థులకు శాలువాలు కప్పి పుష్పగుచ్ఛాలతో అభినందించారు.

అంతర్వేదిలో యోగాంధ్రకు ఏర్పాట్లు

● సుమారు 4వేల మందితో అంతర్వేది బీచ్‌లో యోగా కార్యక్రమం



అంతర్వేది బీచ్‌లో యోగాంధ్ర కార్యక్రమంపై ఏర్పాట్లు పరిశీలిస్తున్న జేసీ, ఆర్డీవో



విజేతలకు బహుమతులు అందజేస్తున్న జేసీ నిషాంతి

అంతర్వేది, జూన్ 2(ఆంధ్రజ్యోతి): దక్షిణ కాశీగా పేరొందిన అంతర్వేది సాగర సంగమ తీరాన బీచ్ పాయింట్ వద్ద ఉదయం 7 నుంచి 8 గంటల వరకు ప్రభుత్వం నిర్వహించబోయే యోగాంధ్ర కార్యక్రమంలో ప్రతీఒక్కరూ పాల్గొనాలని జేసీ నిషాంతి అన్నారు. సోమవారం సాయంత్రం బీచ్‌లో ఏర్పాటుచేసిన యోగా ప్రదేశాన్ని ఆర్డీవో మాధవి, డీఈవో షేక్‌సలీంబాషా, డీఆర్వో రాజకుమారిలతో కలిసి ఏర్పాట్లు పరిశీలించారు. ఉదయం 5 గంటల నుంచి యోగా చేసేందుకు వచ్చే ప్రతీఒక్కరూ వాహనాలను పార్కింగ్ ప్రదేశంలో పెట్టి తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకుని తూర్పుదిశగా వేసిన డయాస్ ఎదురుగా మార్కింగ్ ప్లేస్‌లో కూర్చోవాలన్నారు. ప్రతీఒక్కరూ 6గంటల కల్లా యోగా కార్యక్రమానికి విచ్చేస్తే 7 గంటల నుంచి 8 గంటల వరకూ గంటపాటు యోగా కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. ప్రతీఒక్కరూ తేలికపాటి దుస్తులు ధరించి ప్రభుత్వం అందించిన వైట్ టీ షర్టులను వేసుకుని యోగాలో పాల్గొనాలన్నారు. ఆరోగ్యవంతమైన జీవనాన్ని గడిపేందుకు యోగా ఎంతో దోహదపడుతుందని, ప్రధానంగా జిల్లా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు ఒత్తిడికి గురవకుండా ప్రభుత్వం యోగాంధ్ర అనే మంచి కార్యక్రమం చేపట్టిందన్నారు. అంతర్వేదిలో చేపట్టే ఈ యోగాంధ్ర కార్యక్రమంలో యోగాసనాలు చేసినవారు తమ దినచర్యలో భాగంగా ప్రతీరోజు చేస్తే పూర్తి ఆరోగ్యవంతులుగా ఉంటారని తెలిపారు. నాలుగు అడుగుల డయాస్, విద్యుత్ మైకు, సౌండ్ సిస్టమ్, గ్రీన్ మ్యాట్లు, మార్కింగ్ యోగా నిర్వహించే ప్రదేశ మార్కింగ్ తదితర అంశాలను త్వరితగతిన పూర్తిచేసి మంగళవారం ఉదయం 6 గంటలకల్లా సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం నిర్వహించే ఈ ప్రతిష్ఠాత్మక యోగాంధ్ర కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్డీవో జైచంద్రగాంధీ, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, డీఆర్వో రాజకుమారి, డీఎంహెచ్‌వో దుర్గారావుదొర, తహశీల్దార్ ఎం.వెంకటేశ్వరరావు, ఎంపీడీవో కె.సూర్యనారాయణ, డిప్యూటీ తహశీల్దార్ భాస్కర్, మండల సర్వేయర్ భద్రరాజు, అధికారులు పాల్గొన్నారు.

మలికిపురం: యోగాంధ్రలో భాగంగా సోమవారం మలికిపురం ఎంపీడీవో కార్యాలయం వద్ద ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. గుడిమెళ్లంకలో కూడా ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ హైమావతి, సుజాత, కె.సుజాత, జ్ఞానేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు

అమలాపురం: యోగాంధ్ర-2025 పోటీల్లో భాగంగా జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో అమలాపురం జీఎంసీ బాలయోగి స్టేడియంలో సోమవారం ముగ్గులపోటీలు నిర్వహించారు. యోగాకు ప్రాధాన్యతనిస్తూ యువతులు, మహిళలు ప్రత్యేక ముగ్గులు వేశారు. విజేతలకు ప్రశంసాపత్రాలను జేసీ నిషాంతి అందజేశారు. 235 మంది మహిళలు ఈ పోటీల్లో పాల్గొన్నారు. డీఆర్వో బీఎల్ఎన్ రాజకుమారి, ఐసీడీఎస్ పీడీ బి.శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

యోగాతో బహుళ ప్రయోజనాలు

ఉప్పలగుప్తం : యోగాతో బహుళ ప్రయోజనాలున్నాయని రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కంకటాల రామం అన్నారు. భీమనపల్లి గ్రంథాలయంలో సోమవారం జరిగిన యోగా శిక్షణ, చిత్రలేఖన పోటీల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గ్రంథాలయాధికారి నిమ్మకాయల శేషుకుమార్ మాట్లాడుతూ ఏప్రిల్ 28 నుంచి వేసవి శిక్షణా శిబిరంలో ప్రతిరోజు వివిధ అంశాలపై శిక్షణ, అవగాహన కల్పిస్తున్నామన్నారు. అద్దంకి అమరేశ్వరరావు, కడలి శ్రీనివాసరావు, పెద్దింటి గీత, మల్లిక, శ్యామ్ పాల్గొన్నారు.

నేడు రావులమ్మ అమ్మవారి తీర్థం

అంబాజీపేట, జూన్2(ఆంధ్రజ్యోతి): గంగలకుర్రు అగ్రహారం గ్రామదేవత శ్రీరావులమ్మ అమ్మవారి తీర్థం మంగళవారం ఘనంగా నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. అమ్మవారి పూజాఘటాలు, గరగలను పురవీధులలో ఊరేగించారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. తీర్థంకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

ఆలయంలో జేసీ పూజలు



జేసీ నిషాంతికి ఆశీర్వచనం అందిస్తున్న వేదపండితులు

అంతర్వేది, జూన్2(ఆంధ్రజ్యోతి): అంతర్వేదిలో ఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి సోమవారం విచ్చేశారు. ఆమెకు ఆలయ అధికారులు ఘనస్వాగతం పలికారు. అనంతరం స్వామివారి అంతరాలయంలో స్వామిని దర్శించుకుని వేద పండితులచే వేదాశీర్వచనం పొందారు.

నిత్యాన్నదానానికి విరాళం

అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారి దర్శనం అనంతరం నిత్యాన్నదాన పథకానికి మలికిపురానికి చెందిన అల్లూరి వెంకటమురళీకృష్ణంరాజు, కల్యాణి దంపతులు రూ.1,12,116 విరాళంగా అందజేశారు. ఈ విరాళాన్ని ఆలయ అధికారులకు అందించినట్లు వారు తెలిపారు. ఆశీర్వచనం అనంతరం విరాళ దాతలకు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అందించారు.

మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు శిక్షణ

అయినవిల్లి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల మధ్యాహ్న భోజన పథక నిర్వాహకులకు ముక్తేశ్వరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సోమవారం మండల విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు అధ్యక్షత ఈ శిక్షణ ఏర్పాటుచేశారు. జిల్లా ఎండీఎం, ఏడీ ఎన్.సురేష్ శిక్షణ కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి పలు సూచనలు చేశారు. ఇక నుంచి అన్ని పాఠశాలలకు సన్నరకం బియ్యం పంపిణీ చేస్తామన్నారు. కొత్త మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనాన్ని తయారు చేయాలన్నారు. ప్రతీ పాఠశాలలో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేయాలన్నారు. 5వ తేదీ నుంచి అడ్మిషన్ డ్రైవ్ నిర్వహించి పాఠశాలల రోలు పెంచడానికి కృషి చేయాలన్నారు. అనంతరం వంటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. మండల విద్యాశాఖాధికారి-2 పెచ్చెట్టి శ్రీనివాస్, రిసోర్సు పర్సన్ గుబ్బల సాయిశ్రీనివాస్, సీఆర్పీలు సౌదామణి, రాంజీ, చందు, వెంకటేశ్వరరావులు పాల్గొన్నారు.

క్రీడా పాఠశాలల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

అమలాపురంటౌన్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): వైఎస్సార్ కడప క్రీడా పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి 4, 5 తరగతుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ప్రకటించిందని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి పీఎస్ సురేష్‌కుమార్ తెలిపారు. 4వ తరగతిలో బాలికలు 20, బాలురు 20, 5వ తరగతిలో బాలికలు 20, బాలురు 40 మందిని చేర్చుకుంటారన్నారు. 4వ తరగతిలో ప్రవేశానికి విద్యార్థి 2015 ఏప్రిల్ 1 నుంచి 2017 మార్చి 31 మధ్యలో జన్మించి ఉండాలి. 1 నుంచి 3వ తరగతి వరకు ప్రభుత్వ, గుర్తింపు పొందిన పాఠశాలలో తప్పనిసరిగా ఉత్తీర్ణులై ఉన్నవారిని మాత్రమే ప్రవేశానికి ఎంపిక చేస్తారు. 5వ తరగతిలో ప్రవేశానికి 2014, ఏప్రిల్ 1 నుంచి 2016 మార్చి 31 మధ్యలో జన్మించిన వారు అర్హులు. క్రీడాకారులు ప్రభుత్వం సూచించిన వెబ్‌సైట్‌లో ఈనెల 19వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలి. 20 నుంచి 25వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో సమర్పించిన దరఖాస్తులను పరిశీలనచేసి జాబితా విడుదల చేస్తారు. జూలై 1 నుంచి 3వ తేదీ వరకు ఆయా జిల్లా క్రీడా ప్రాధికార సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించే జిల్లాస్థాయి ఎంపికలకు ఒరిజినల్ పత్రాలతో హాజరుకావాలన్నారు. అర్హత సాధించినవారు జూలై 10, 11 తేదీల్లో రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ సూచించే క్రీడా ప్రాంగణంలో రాష్ట్రస్థాయి ఎంపికలకు హాజరు కావాల్సి ఉంటుందన్నారు. వివరాలకు 7993329433ని సంప్రదించాలి.

ఉషా కిరణ్ ఐటీఐలో జాబ్‌మేళా

ముమ్మిడివరం, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉషాకిరణ్ ఐటీఐ కళాశాలలో ఈనెల 4వ తేదీన జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్టు ఆ కళాశాల కరస్పాండెంట్ మట్టా త్రిమూర్తులు తెలిపారు. వికాస సంస్థ ఆధ్వర్యంలో ఐటీసీ లిమిటెడ్ ఫుడ్ డివిజన్‌వారు ఈ జాబ్‌మేళాను నిర్వహిస్తున్నారన్నారు. ప్రధానంగా 40 పోస్టులు ఉన్నాయన్నారు. అప్రెంటీస్‌కు నెలకు రూ.11వేలు తరువాత సంవత్సరం నుంచి రూ.25 వేలతో ఉద్యోగం ఇస్తామన్నారు. ఇంటర్, ఐటీఐ, ఒకేషనల్ యువత ఈ జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ మట్టా త్రిమూర్తులు సూచించారు.

చెత్తరహిత గ్రామంగా తీర్చిదిద్దాలి

రాజోలు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): చెత్తలేని రహిత గ్రామంగా శివకోటి గ్రామాన్ని తీర్చిదిద్దాలని శివకోటి సర్పంచ్ నక్కా రామారావు పిలుపునిచ్చారు. శివకోటిలో గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ రామారావు అధ్యక్షతన స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ మిషన్ కార్యక్రమంలో భాగంగా తడిపొడిచెత్తపై అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. డీపీఆర్సీ సిబ్బంది ఆర్పీఎస్ఎన్వీ భీమేశ్వరి, ఎఫ్‌టీసీ మధుమహేష్‌లు ఐవీఆర్ఎస్ కాల్స్ గురించి వివరించారు. శివకోటి గ్రామం చెత్త నుంచి సంపద కేంద్రంగా ఎంపికైందని తెలిపారు.

ఇరిగేషన్ కార్పొరేషన్ చైర్మన్ లీలాకృష్ణకు ఎమ్మెల్యే గిడ్డి శుభాకాంక్షలు

పి.గన్నవరం, జూన్ 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఇరిగేషన్ కార్పొరేషన్ చైర్మన్‌గా విజయవాడలో బాధ్యతలు స్వీకరించిన మండపేట జనసేనపార్టీ ఇన్‌చార్జ్ వేగుళ్ల లీలాకృష్ణకు ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన చాంబర్‌లో ఆయనను కలుసుకుని దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. రాష్ట్ర నీటివనరుల అభివృద్ధికి విశేష కృషిచేయాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.



విజయవాడలో వేగుళ్ళ లీలాకృష్ణ శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే గిడ్డి

మలేరియా నివారణా మాసోత్సవాలు



మలేరియాపై ప్రత్యేక ర్యాలీగా అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి

అంతర్వేది, జూన్ 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 1వ తేదీ నుంచి నెలాఖరు వరకు మలేరియా నివారణకు ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారని డాక్టర్ పి.జయగాయత్రి తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద మలేరియా వ్యాధిపై ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియచేస్తూ అవగాహన కల్పించారు. ప్రతీ శుక్రవారం డ్రైడేను పాటించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ పి.దుర్గాకావ్య, పీఎల్ఎన్ స్వామి, పి.సరస్వతి, శంకర్, కరణకుమార్, పీహెచ్‌సీ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మలేరియా మాసోత్సవ ర్యాలీ

అంబాజీపేట, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మలేరియా మాసోత్సవ ర్యాలీని అంబాజీపేట ప్రాథమిక ఆర్యోగ కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. నివాస ప్రాంతాల మధ్య మురుగు నిల్వలేకుండా చూసుకోవాలన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా, కుట్టకుండా చూసుకోవడం ద్వారా వ్యాధి నివారించవచ్చునన్నారు. ప్రస్తుతం కోవిడ్ గురించి ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ఇంటింటికీ సర్వే నిర్వహించాలని పీహెచ్‌సీ వైద్యాధికారి కేఎన్ శ్రీనివాస్ సూచించారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, సీహెచ్‌వో అప్పారావు, పీహెచ్ఎన్ భూలక్ష్మి, హెచ్‌వీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చిరంజీవినీకుమారి మృతి సాహిత్య, సాంస్కృతిక కార్యకలాపాలకు తీరనిలోటు



యానాంలో చివరిసభలో పాల్గొన్న చిరంజీవినీ కుమారి(ఫైల్)

యానాం, జూన్ 2(ఆంధ్రజ్యోతి): విద్యావేత్త, సాహితీవేత్త రచయిత్రి డాక్టర్ చిరంజీవినీకుమారి మృతితో సాహిత్య సాంస్కృతిక కార్యకలాపాలకు పెద్దదిక్కు కోల్పోయినట్లయిందని స్ఫూర్తి సాహితీ సమాఖ్య అధ్యక్షుడు దాట్ల దేవదానంరాజు అన్నారు. కాకినాడ వేదికగా చిరంజీవినీకుమారి ఆధ్వర్యంలోనే అనేక ప్రామాణికమైన గ్రంథాలు వెలువడ్డాయని అన్నారు. అనేక కార్యక్రమాల్లో భాగస్వామిని చేయడమేగాక ఇటీవల ఏప్రిల్ 13న యానాంలో జరిగిన కళారత్న పురస్కార సభలో ఆశీస్సులు అందజేశారని అదే చిరంజీవినీకుమారి పాల్గొన్న చివరి సభ అయ్యిందని దాట్ల గుర్తు చేసుకున్నారు. మరణవార్త తెలియగానే ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, పి.విష్ణుమూర్తి, శిఖామణి, భాస్కరరెడ్డి, నామాడి అప్పారావు, ముదునాపంతులు, పి.అశోక్‌కుమార్ పలువురు యానాం మిత్రులు సంతాపం తెలిపారు.

స్వామివారికి ఎమ్మెల్యే యార్లగడ్డ పూజలు

అంతర్వేది, జూన్ 2(ఆంధ్రజ్యోతి): అంతర్వేదిలో కొలువైఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి కృష్ణాజిల్లా గన్నవరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు కుటుంబ సమేతంగా సోమవారం విచ్చేశారు. వారికి ఆలయ అధికారులు ఘనస్వాగతం పలికారు. వేద పండితులు మహదాశీర్వచనం చేయగా ఏసీ సత్యనారాయణ స్వామివారి చిత్రపటం అందజేశారు.



గన్నవరం ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ యార్లగడ్డ వెంకట్రావుకు స్వాగతం పలుకుతున్న అర్చకులు, అధికారులు

సఖినేటిపల్లి లాకులను పరిశీలించిన చైర్మన్ గుబ్బల



సఖినేటిపల్లి లాకులను పరిశీలిస్తున్న గోదావరి డెల్టా ప్రాజెక్టు చైర్మన్ గుబ్బల శ్రీనివాస్

అంతర్వేది, జూన్2(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలం సఖినేటిపల్లి లాకులు, పూడికతీత పనులను గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు చైర్మన్ గుబ్బల శ్రీనివాస్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లాకులు గేటు వద్ద పేరుకుపోయిన వ్యర్థాలను త్వరితగతిన తొలగించాలని నీటిసంఘం అధ్యక్షుడు నామన నాగభూషణం తెలిపారు. కాల్వలో పూడికతీత పనులు త్వరగా పూర్తిచేయించి రాబోయే ఖరీఫ్ పంటకు సఖినేటిపల్లి మండలంలో రైతులకు తాగునీరు అందించేందుకు కృషి చేస్తానన్నారు. అలాగే కాల్వలు, పంటబోదెల పనులను జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తిచేయాలని నీటిసంఘాల సభ్యులతో మాట్లాడారు. కార్యక్రమంలో నీటిసంఘం వైస్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ ఆకన బాబ్జినాయుడు, సఖినేటిపల్లి నీటిసంఘ అధ్యక్షుడు నామన నాగభూషణం, పాటబళ్ల సూరిబాబు, నామన సూర్యనారాయణ, మామిడిశెట్టి నాగరాజు, నామన గోపాలం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్పస్వామి వార్షికోత్సవం

ముమ్మిడివరం, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరంలోని శ్రీధర్మశాస్త్ర అయ్యప్పస్వామివారి 16వ వార్షికోత్సవ వేడుకలను సోమవారం వైభవంగా నిర్వహించారు. స్వామివారికి సోమవారం ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహించారు. పెన్మెత్స జగప్పరాజు, పెన్మెత్స సీతారాముడు, సరిపెల్ల రామకృష్ణంరాజు, వేములవలస చిన్నారావు, కాజులూరి రామలింగేశ్వరరావు, గంజి జాబి, సిద్ధిన రమణ, మహీధర వర్మ, జగతా గోవిందుల, బాబిశర్మతో పాల్గొన్నారు.

నీళ్లు లేక విలవిల

● పది రోజులైనా పట్టించుకోని అధికారులు



అంతర్వేది దేవస్థానం గ్రామంలో ఖాళీ బిందెలతో ఆందోళన చేస్తున్న మహిళలు

అంతర్వేది, జూన్ 2(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి దేవస్థానం గ్రామంలో పది రోజులైనా తాగునీరు లేకపోవడంతో విలవిల్లాడుతున్నారు. ఖాళీ బిందెలతో మహిళలు రోడ్డుపై ఆందోళన చేపట్టారు. వాటరు ట్యాంకు ద్వారా రెండు డ్రమ్ములు నీళ్లు పోసి చేతులు దులిపేసుకుంటున్నారని, వేసవి కాలంలో చుక్కనీరు లేక దాహార్తితో ప్రజలు ఇక్కట్లకు గురవుతున్నారని, అధికారులు మాత్రం చోద్యంచూస్తూ పది రోజులైనా నీరు ఇవ్వకపోవడంపై గ్రామస్తులు, మహిళలు రోడ్డుపై ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. తీర ప్రాంత గ్రామాల్లో అక్కడక్కడా తాగునీటి సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్టు వాపోయారు. దీనిపై అధికారులు స్పందించాలని నిరసన తెలుపుతున్న మహిళలు తెలిపారు.

'ప్రభుత్వ కళాశాలల్లో పిల్లలను చేర్పించాలి'

యానాం, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ ప్రభుత్వ కళాశాలలో తమ పిల్లలను చేర్పించాలని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు అన్నారు. సోమవారం స్థానిక టంగుటూరి ప్రకాశం పంతులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సెలవుల అనంతరం విద్యాలయ పునఃప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ముందుగా కళాశాల ఆవరణలోని సరస్వతీదేవి విగ్రహంవద్ద పూజలు నిర్వహించారు. ప్రభుత్వ విద్యాలయాలలో ప్రభుతం అన్ని సదుపాయాలను ఏర్పాటుచేస్తుందన్నారు. ముఖ్యంగా ప్రభుత్వకళాశాలలైన టంగుటూరి ప్రకాశం పంతులు ప్రభుత్వ జూనియర్ కళాశాల, రక్ష హరికృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంకా చేపటాల్సిన ఏర్పాట్లపై అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు కావాల్సిన అన్ని సదుపాయాలను సమకూర్చాలని అధికారులకు సూచించారు.

ముగిసిన ఆంజనేయస్వామి కల్యాణోత్సవాలు

కె.గంగవరం, జూన్ 2(ఆంధ్రజ్యోతి): కోటిపల్లిలోని ఆంజనేయస్వామి ఆలయంలో సోమవారం స్వామివారి కల్యాణోత్స వాలు నిర్వహించారు. ముగింపును పురస్కరిం చుకుని సోమవారం అన్న సమారాధన జరిపారు. టీడీపీ సీనియర్ నాయకుడు పప్పుల మసేను వెంకన్న (రేవు శ్రీను), సాయిబాబు ఆధ్వర్యంలో అన్న సమారాధన చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పెమ్మాడి బేబి, పెమ్మాడి సత్తిబాబు, అయినవిల్లి సూరిబాబు, మానే గంగాధర్, మానే సాయిబాబు, మతుకమిల్లి అమర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

పేదలకు గృహవసతి కల్పించాలని సీపీఐ ధర్నా

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూన్ 2 (ఆంధ్రజ్యోతి): పేదలకు గృహవసతి కల్పించాలని తదితర డిమాండ్లతో సోమవారం తహసీల్దార్ కార్యాయం ముందు సీపీఐ ధర్నా నిర్వహించింది. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా జరిపి డిప్యూటీ తహసీల్దార్ మాధురికి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పెద్దిరెడ్డి రాము, ఎస్.శారదాదేవి, వి.రాంబాబు, ర్యాలి సత్తిబాబు, టిడ్కో లబ్ధిదారులు పాల్గొన్నారు.


వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

వాడపల్లి ఆదాయం రూ.4.43లక్షలు

ఆత్రేయపురం, జూన్ 2(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం భక్తులతో రద్దీనెలకొంది. నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర పూజలు, నిత్యకల్యాణాలు జరిపారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తులు అన్నప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.4,43,325 వచ్చినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి కృష్ణా జిల్లా కానూరుకు చెందిన ములకపల్లి శేషసాయి రూ.50,116 విరాళం ఇచ్చారు. దాతలకు స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందించారు.

ఏపీఐడీసీ చైర్మన్‌గా లీలాకృష్ణ బాధ్యతల స్వీకరణ

మండపేట, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ఏపీఐడీసీ చైర్మన్‌గా కపిలేశ్వరపురం మండలం వల్లూరుకు చెందిన జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణ పదవీ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో సోమవారం విజయవాడలో జరిగింది. కూటమినేతలు, అభిమానుల మధ్య ఆయన ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన్ను మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, రాష్ట్రమంత్రులు నాదెండ మనోహర్, వాసంశెట్టి సుభాష్, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ చిన్ని, కోనసీమకు చెందిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావుతో పాటు పలువురు ఎమ్మెల్యేలు, మండపేట మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, కూమార్‌బాబు, యరగతపు బాబ్జి, చుండ్రు రాంబాబు, ఉండమట్ల రామారావు, కర్రి తాతారావు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నల్లమిల్లి వీరెడ్డి, కృష్ణా జిల్లా జనసేన అధ్యక్షుడు సామినేని ఉదయబాబు, జనసేన రాష్ట్ర నాయకులు అమ్మిశెట్టి వాసు, ప్రియా సౌజన్య, రాష్ట్ర సాగునీటి పారుదల అభివృద్ధి సంస్థ ఎండీ తిరుమలరావు, కూటమినేతలు, జన సైనికులు తదితరులు ఆయన్ను కలిసి అభినందించారు.


లీలాకృష్ణను అభినందిస్తున్న దృశ్యం

జేఈఈ అడ్వాన్స్‌లో పలువురు విద్యార్థుల సత్తా

ఆలమూరు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): జేఈఈ అడ్వాన్సు ఫలితాలలో ఆలమూరు మండలానికి చెందిన పలువురు విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారు. చెముడులంక గ్రామంలోని ఒకరైతు కుటుంబానికి చెందిన నాగిరెడ్డి తేజ చంద్రనారాయణ జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో ఈడబ్ల్యుఎస్ కేటగిరిలో 172వ ర్యాంకు, ఓపెన్ కేటగిరిలో 1911 ర్యాంకు సాధించారు. ఆలమూరుకు చెందిన నెక్కంటి సాకేత్ జేఈఈ అడ్వాన్సులో ఆల్ ఇండియా ఒపెన్ కేటగిరిలో 1393 ర్యాంకు సాధించినట్లు విద్యార్థి బంధువులు తెలిపారు.

వెంకటరాజుకు 135వ ర్యాంకు: జేఈఈ అడ్వాన్సులో సంధిపూడికి చెందిన తోట వెంకటరాజు ఈడబ్ల్యుఎస్ కేటగిరిలో 135 ర్యాంకు పొందారు. సర్పంచ్ కుమారుడు జేఈఈ మెయిన్‌లో 335 ర్యాంకు సాధించారు. సోమవారం విడుదలైన అడ్వాన్స్ ఫలితాలలో ఆల్ ఇండియా ఓపెన్ కేటగిరిలో 1533, ఈడబ్ల్యుఎస్ కేటగిరిలో 135 ర్యాంకును వెంకటరాజు పొందగా పలువురు అభినందించారు.

కొత్తపేట, (ఆంధ్రజ్యోతి): జేఈఈ అడ్వాన్స్‌డ్ ఎంట్రన్స్ టెస్టులో జాతీయస్థాయిలో 82వ ర్యాంకు సాధించాడు. మోడేకుర్రు శివారు గొలకోటివారిపాలానికి చెందిన తోరాటి భరద్వాజ్ విజయవాడలో ఇంటర్ పూర్తి చేశారు. ఇటీవల జరిగిన అడ్వాన్స్‌లో 82వ ర్యాంకు సాధించాడు. ముంబై ఐఐటీలో సీట్ సాధించడమే లక్ష్యమన్నారు. గ్రామస్తులు అతన్ని అభినందించారు.

కె.గంగవరంలో..

కె.గంగవరం, (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్‌లో గంగవరం గ్రామానికి చెందిన కొడవటి సువర్ణరామ్ ప్రత్యూష్ ఆల్ ఇండియా 510వ ర్యాంకు సాధించాడు. తన విజయంలో తల్లిదండ్రుల సహకారంతో పాటు కుటుంబ సభ్యుల ప్రోత్సాహం ఉన్నాయన్నారు.

ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు

ఆత్రేయపురం, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా యోగా శిక్షణ తరగతులను నిర్వహించారు. ఇందులో భాగంగా ర్యాలీలో ముత్యాల ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాల్లో గెలిచిన వారికి ఎంపీడీవో వెంకటరామన్ చేతులు మీదుగా మహిళలకు బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో యోగా శిక్షకులు పీఈటీలు శ్రీనివాస్, శోభారాణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కుమారి, ఎవో రామస్వరూప్ తదితరులు పాల్గొన్నారు.


ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు ఇస్తున్న దృశ్యం

పాడి పరిశ్రమకు ప్రాధాన్యం

కొత్తపేట, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పాడి పరిశ్రమ అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. పలివెలలో పాడి రైతులకు ఆయన పశువుల దాణా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల పక్షపాతిగా కూటమి ప్రభుత్వం గోకులాలు నిర్మాణాలు చేపట్టి మేలు చేస్తుందన్నారు. రైతులకు అన్ని విధాలా ప్రభుత్వ సహకారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సాదే లక్ష్మిశ్రీనివాస్, కంఠంశెట్టి శ్రీనివాసరావు, పశువైద్యాధికారులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై బీజేపీనేతల ఫిర్యాదు

మండపేట, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలో వున్న పలు ప్రజా సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని బీజేపీ నేతలు సోమవారం జరిగిన గ్రీవెన్స్‌లో ఎంపీడీవో సత్యనారాయణకు ఫిర్యాదు చేశారు. తాపేశ్వరంలో వున్న బస్టాండ్ వినియోగంలోకి తేవాలని, మారేడుబాకలో జలజీవన్ మిషన్ పనులు పూర్తి చేయాలని కోరారు. ద్వారపూడిలో బంగారమ్మ కాలనీలో డ్రైన్‌కు ఊసలు పైకి వచ్చి ప్రమాదకరంగా మారాయని తదితర పలు సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కె.సత్యానారాయణ, కె.మురళీకృష్ణ, బీజేపీ పట్టణ మాజీ అధ్యక్షుడు మద్దుల సుబ్బారావు వున్నారు.


మండపేటలో ఎంపీడీవోకు ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు

జవహర్‌ను కలిసిన మండపేట నేతలు

మండపేట, జూన్ 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా సోమవారం బాధ్యతలు స్వీకరించిన కెఎస్ జవహర్‌ను మండపేటకు చెందిన టీడీపీ ఎస్సీ నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ మండపల్లి చంద్రశేఖర్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు దూళి జయరాజు తదితరులు సత్కరించి అభినందించారు.

కూలిన వాటర్ ట్యాంకు పైకప్పు

తాగాలంటే భయం..భయం

మండపేట, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మండపేటలో 1975లో నిర్మించిన వాటర్ ట్యాంకు శిథిలావస్థకు చేరి పైభాగం కూలిపోవడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. అక్కడి నుంచి వచ్చే మంచినీరు సురక్షితమేనా అన్న అనుమానాలు స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. ఈ ట్యాంకుతోపాటు వాటర్ వర్క్సులో వున్న మంచినీటి ట్యాంక్ ద్వారా పట్టణ వాసులకు తాగునీరు అందుతోంది. ఇటీవల శిథిలావస్థకు చేరిన వాటర్ ట్యాంకుకు తాత్కాలిక మరమ్మతులు చేసి మంచినీరు సరఫరాకు అంతరాయం కలగకుండా మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. దెబ్బతిన్న మంచినీటి ట్యాంక్ స్థానంలో కొత్తది నిర్మించడంతో పాటు, పాత దానికి మరమ్మతులు చేయాలని స్థానిక ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఇటీవల అధికారులను ఆదేశించారు. ఆయన ఆదేశాల మేరకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. బూరుగుంట ట్యాంకుతోపాటు వాటర్ వర్క్సులో వున్న మరో వాటర్ ట్యాంకు ద్వారా పట్టణ వాసులకు మంచినీరు అందుతోంది. ఈ రెండు ట్యాంకులకు అనుసంధానంగా పట్టణంలో 65 కిలోమీటర్ల మేర పైపులైన్లు వున్నాయి. వీటిలో పాతకాలం నాటి కుండ పైపులు 25 కిలోమీటర్ల మేర వున్నాయి. దీంతో అవి తరచూ పాడవు తుండటంతో ఎప్పటికప్పుడు తాత్కాలిక మరమ్మతులు చేస్తున్నారు. మిగిలిన పైపులైన్లు పీవీసీ, హెచ్‌డీసీ పైపులైన్లతో వున్నాయి. ఇవికాకుండా పట్టణంలో గొల్లపుంత కాలనీలో మూడు వాటర్ ట్యాంకుల ద్వారా ఆయా కాలనీవాసులకు మంచినీరు సరఫరా అవుతోంది. మండపేటలో శిథిలావస్థకు చేరిన వాటర్ ట్యాంకుకు తాత్కాలిక మరమ్మతులు చేయటంతోపాటు పాత ట్యాంకు స్థానంలో నూతన ట్యాంకు నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేస్తున్నామని మండపేట మున్సిపల్ డీఈఈ శ్రీనివాస్ తెలిపారు. దెబ్బతిన్న వాటర్ ట్యాంకుకు మరమ్మతుల కోసం ఉన్నతాధికారుల బృందం పరిశీలించిన అనంతరం వారి సూచనల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు. వాటర్ ట్యాంకు పరిధిలోగల నాళంవీధి, సంకావారివీధి, రాజారత్న రైస్‌మిల్లు ఏరియా, మంతా వారి పుంత, సూర్యారావుపేట, విద్యావికాస్ వీధి, వల్లూరి వీధి, చెన్నావారి వీధి, ఆలమూరు రోడ్డు, మేదరపేట, వాణీమహల్, సైదుల్‌పేట, సంగం పుంతకాలనీ తదితర ప్రాంతాలవాసులకు మంచినీరు ట్యాంకర్ ద్వారా జరుగుతుందని అధికారులు తెలిపారు. వాటిని శుభ్రం చేసుకుని ప్రజలు తాగాల్సి ఉంటుందన్నారు.



బూరుగుంట చెరువు వద్ద వున్న వాటర్ ట్యాంకు. పక్క చిత్రంలో కూలిన పైకప్పు భాగం


పైకప్పు కూలిన వాటర్ ట్యాంకును పరిశీలిస్తున్న పబ్లిక్ హెల్త్ ఎస్ఈ అధికారుల బృందం

వాటర్ ట్యాంక్ రూఫ్ పరిశీలన

మండపేట, జూన్ 2(ఆంధ్రజ్యోతి): బూరుగుంట చెరువు వద్ద వున్న మున్సిపల్ వాటర్ ట్యాంకు పైకప్పు కూలిన నేపథ్యంలో సోమవారం మున్సిపల్ పబ్లిక్ హెల్త్ ఉన్నతాధికారుల బృందం పరిశీలించింది. రాజమహేంద్రవరం పబ్లిక్ హెల్త్ ఎస్ఈ పాండు రంగారావు, ఈఈ వేంకటేశ్వరరావు, డీపీహెచ్‌వో హుస్సేన్‌ల బృందం వాటర్ ట్యాంకు టాప్‌రూప్‌ను పరిశీలించారు. వాటర్ ట్యాంకు పైభాగంలో తాత్కాలిక మరమ్మతులు చేయాలని సూచించారు. పాతదాని స్థానంలో మరో వాటర్‌ట్యాంకు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. స్థానిక మున్సిపల్ ఇంజనీరింగ్ డీఈఈ శ్రీనివాస్‌ను వాటర్ ట్యాంకు సమాచారాన్ని తెలుసుకున్నారు. వారి వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారాణి, మున్సిపల్ కమిషనర్ రంగారావు, మున్సిపల్ డీఈఈ శ్రీనివాస్, పలువురు ఏఈలు తదితరులు వున్నారు.


బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న వాసంశెట్టి సత్యం, తహశీల్దార్ ముత్యుంజయరావు

బాధిత కుటుంబానికి చెక్కు అందజేత

కె.గంగవరం, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ఇటీవల శేరిలంక వద్ద గోదావరిలో మునిగి మరణించిన ఎలిపే మహేష్ కుటుంబానికి నష్టపరిహారం చెక్కును టీడీపీ సీనియర్ నాయకుడు వాసంశెట్టి సత్యం, తహశీల్దార్ బండి ముత్యుంజయరావు అందజేశారు. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు ముమ్మిడివరంలో పర్యటించిన సందర్భంలో బాధిత కుటుంబాలకు సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా రూ.2లక్షలు పరిహారం ప్రకటించారు. సోమవారం కూటమి నాయకులు బాధిత కుటుంబానికి చెక్కు అందజేశారు.


జవహర్‌ను అభినందిస్తున్న దృశ్యం

జవహర్‌కు పలువురు అభినందనలు

మండపేట, జూన్ 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా విజయవాడలో బాధ్యతలు స్వీకరించిన కేఎస్ జవహర్‌ను పలువురు అభినందించారు. రాష్ట్ర మంత్రి సుభాష్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బుంగ సంజయ్ తదితరులతో పాటు పలువురు అభినందించారు.

అనుమతి లేకున్నా గోడను ధ్వంసం చేశారు

మండపేట, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ద్వారపూడిలో టీడీపీ ప్రభుత్వంలో నిర్మించిన రైల్వే ఫ్లై ఓవర్ వంతెనకు ద్వారపూడి వైపు రహదారులు భవనాలశాఖ ఆధ్వర్యంలో నిర్మించిన రక్షణగోడను ప్రైవేటు లేఅవుట్ కోసం నిర్వాహకులు ధ్వంసం చేశారు. కాలిబాటకు అనుమతిలిస్తే భారీ వాహనాలు వెళ్లేందుకు వీలుగా రక్షణగోడను బద్దలు గొట్టేశారు. ప్రైవేటు వ్యక్తులకు చెందిన లేఅవుట్ కోసం ప్రభుత్వ అధికారులు అడ్డగోలుగా అనుమతులు ఇవ్వటంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అర్ధరాత్రివేళ లేఅవుట్ నిర్వాహకులు గోడలను బద్దలు గొట్టి, తమకు నచ్చిన విధంగా నడకదారిపేరిట భారీ రహదారిని నిర్మించుకుని తమ ఆస్తుల విలువలను పెంచుకుని ప్రభుత్వ ఆస్తిని ధ్వంసం చేశారు. గోడ పగుల గొట్టిన విషయంపై రామచంద్రపురం రహదారులు భవనాల శాఖ డీఈఈ సూర్యనారాయణను వివరణ కోరగా లేఅవుట్ యజమాని కాలిబాట నడకదారి కోసం దరఖాస్తు చేసుకుంటే అనుమతి ఇచ్చామన్నారు. అంతే తప్ప భారీ వాహనాల రాకపోకల కోసం అనుమతులు ఇవ్వలేదన్నారు. తాము ఇచ్చిన అనుమతులు మించి గోడను పగలుగొడితే విచారణ చేసి యజమానిపై చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

కొనసాగుతున్న శ్రీవాణి దీక్ష

మండపేట, జూన్ 2(ఆంధ్రజ్యోతి): కేశవరంలో వున్న జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రహరీ గోడ కోసం గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త వల్లూరి శ్రీవాణి చేస్తున్న శాంతిదీక్ష సోమవారం 46వ రోజుకు చేరింది. గ్రామానికి చెందిన తాను విద్యార్థుల భవిష్యత్ కోసం, పాఠశాల ఆస్తులను కాపాడాలని జరుపుతున్న దీక్షకు పాలకులు సహకరించకపోయినా తన దీక్ష కొనసాగుతుందని అమె చెప్పారు. ప్రహరీ నిర్మించే వరకు తాను దీక్ష విరమించేది లేదని ఆమె తెలిపారు.

యోగాతో ఆరోగ్యం పదిలం

మంత్రి సుభాష్

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రజల జీవన విధానంలో యోగా భాగం కావాలని మంత్రి సుభాష్ అన్నారు. స్థానిక కృత్తివెంటి పేర్రాజు పంతులు జూనియర్ కళాశాలలో నిర్వహించిన యోగాంధ్రలో మంత్రి పాల్గొని ప్రసంగించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షకు అనుగుణంగా ప్రారంభించిన యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. విశాఖలో జూన్ 21న జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ప్రధాని మోడీ పాల్గొంటున్నారని తెలిపారు. ప్రపంచానికి యోగ ప్రాముఖ్యత తెలియజేస్తూ రాష్ట్రానికి ప్రపంచంలో మంచి గుర్తింపు వచ్చేలా దీన్ని నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, కమిషనర్‌తో పాటు, మున్సిపల్ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మండల పరిషత్ కార్యాలయంలో యోగా పోటీలు

ద్రాక్షారామ, (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం పరిషత్ కార్యాలయంలో సోమవారం సచివాలయాల సిబ్బందికి యోగ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం నిర్వహించిన యోగా పోటీల్లో విజేతలకు మండల పరిషత్ కార్యాలయంలో సోలో యోగ, మెడిటేషన్, సూర్య నమస్కారాలు, ప్రాణాయామం, ఆసనాలు, రంగోలీ పోటీలు జరిపారు. కార్యక్రమంలో ఎండీవీ కడలి పద్మజ్యోతి, సిబ్బంది పాల్గొన్నారు.

సోమేశ్వరంలో యోగాంధ్ర

రాయవరం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమేశ్వరం గ్రామంలో యోగాంధ్రను పురస్కరించుకుని సోమవారం యోగాపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీడీపీ అమలాపురం పార్లమెంట్ ఉపాధ్యక్షుడు వైఆర్కే పరమహంస ఈ సందర్భంగా మాట్లాడారు. అనంతరం గ్రామస్తులు, ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు, విద్యార్థులకు యోగాపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు శాకా శ్రీనివాస్, ఎస్.దుర్గా ప్రసాద్ తదితరులతో పాటు, పంచాయతీ కార్యదర్శి పి.వెంకటరత్నం, సచివాలయ కార్యదర్శి ఎం.వెంకటలక్ష్మి, వీఆర్వో సుజాత తదితరులు పాల్గొన్నారు.

రాయవరంలో ముగ్గుల పోటీలు: రాయవరం యోగాంధ్రలో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మాట్లాడుతూ యోగాపై ప్రజల్లో మరింత అవగాహన పెంపొందించాలన్నారు. అనంతరం మహిళలకు ముగ్గులు పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో సుధారాణి, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, పలువురు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



యోగాంధ్ర కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ముగ్గుల ప్రదర్శన

రావులపాలెం, (ఆంధ్రజ్యోతి): రావులపాలెం పంచాయతీ ఆవరణలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ముగ్గుల ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సింబల్, తమ పరిధిలో చేసే సేవల రూపాలు, యోగాసనాల ఆకారాలు, ముగ్గులతో ప్రదర్శనగా ఏర్పాటు చేశారు. ఉపసర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి, కార్యదర్శి ఎల్.దుర్గాప్రసాద్ వాటిని పరిశీలించి బహుమతులు అందచేశారు.

ఆలమూరు, (ఆంధ్రజ్యోతి): యోగాను చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎంపీడీవో ఎ.రాజు, తహశీల్దార్ కేజే ప్రకాష్ బాబు అన్నారు. ఆలమూరు మండలం పరిషత్ కార్యాలయంలో సోమవారం జరిగిన యోగా శిక్షణ తరగతుల్లో ఉద్యోగులతో కలసి యోగా చేశారు. యోగా తరగతులను ఎంఈవో బి.అప్పాజీతోపాటు పలువురు నిర్వహించారు.

మలేరియా నివారణ అవగాహన ర్యాలీ

ఆలమూరు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మలేరియా నివారణ మాసోత్సవాల్లో భాగంగా పెదపళ్ల పీహెచ్‌సీ పరిధిలో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాలు బి.అనంతరామకృష్ణ అధ్వర్యంలో మలేరియా అవగాహన ర్యాలీ, అవగాహన సదస్సు నిర్వహించి ప్రజలకు నివారణ చర్యలు తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేటర్ రాజా అక్కుల, సీహెచ్‌వో ఎంఎస్ఎన్ రెడ్డి, సూపర్‌వైజర్లు శ్రీనివాస్, ఉమ, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్రేయపురం, (ఆంధ్రజ్యోతి): మలేరియాను తరిమికొట్టాలని వైద్యాధికారులు సౌమ్య, హైమాశ్రీ పిలుపునిచ్చారు. మలేరియా నివారణ వారోత్సవాల్లో భాగంగా సోమవారం ఆత్రేయపురం ప్రాధమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించారు.

మండపేట, (ఆంధ్రజ్యోతి): పరిసరాలు శుభ్రతగా ఉంటే అరోగ్యంగా ఉంటామని వైద్యులన్నారు. కేశవరం, ద్వారపూడి ఆరోగ్యకేంద్రాల ఆధ్వర్యంలో సోమవారం మలేరియా నిర్మూలన దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రజలకు వ్యాధుల పట్ల అవగాహన కల్పిస్తూ గ్రామాల్లో వైద్య సిబ్బంది, వైద్యులు ర్యాలీ చేశారు. కేశవరం, ద్వారపూడిలో జరిగిన ర్యాలీలో వైద్యులు రమ్యశ్రీ, సంధ్యలు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రామచంద్రపురం(ద్రాక్షారామ), (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం కోట హరిజనపేట, అర్బన్ పీహెచ్‌సీ వద్ద మలేరియా నివారణ మాసోత్సవాల్లో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ప్రోగాం అధికారి డాక్టర్ హరీష్ ఈ సందర్భంగా మాట్లాడారు. కార్యక్రమంలో డివిజనల్ సూపర్‌వైజర్ కమలశేషు, సబ్ యూనిట్ అధికారి సత్యనారాయణ, సూపర్‌వైజర్ బి.మరియమ్మ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కల్యాణ మండపాల ద్వారా రూ.18.5 లక్షల ఆదాయం

ద్రాక్షారామ, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో కల్యాణ మండపాల ద్వారా భీమేశ్వరస్వామికి ఏటా రూ.18.5 లక్షల ఆదాయం సమకూరనుంది. సోమవారం ఆలయ సహాయ కమీషనరు అల్లు వెంకట దుర్గాభవానీ బహిరంగ వేలం నిర్వహించారు. గతంలో ఏడాదికి రూ.13 లక్షలు ఆదాయం రాగా ఈ ఏడాది రూ.18.05 లక్షలు ఆదాయం సమకూరింది. కోటిపల్లి రేవులో కల్యాణ మండపం డెకరేషన్‌కు గతంలో రూ.6.07 లక్షల ఆదాయం రాగా ఈ ఏడాది రూ 6.20 లక్షలు సమకూరనుంది. బహిరంగ వేలం పాటలను దేవదాయశాఖ తనిఖీదారు బాలాజీరామ్ ప్రసాద్ పర్యవేక్షించారు.

ఎమ్మెల్సీ తోట విమర్శలు హాస్యాస్పదం

రాయవరం, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వంపై పసలపూడిలో జరిగిన వైసీపీ సమావేశంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు చేసిన విమర్శలు హాస్యాస్పదమని టీడీపీ నాయకుడు రిమ్మలపూడి వేణుగోపాలదొర, టీడీపీ మండలాధ్యక్షుడు కొప్పిశెట్టి మాధవరావు అన్నారు. సోమవారం వెంటూరు గ్రామంలో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ వైసీపీ పాలనలో అమ్మఒడి ఒకరికి మాత్రమే ఇచ్చారన్నారు. అదికూడా మూడు సంవత్సరాలు మాత్రమే ఇచ్చి చివరి ఏడాది ఎగ్గొట్టారన్నారు. కూటమి ప్రభుత్వం ఈనెలలో చదువుకునే పిల్లందరికీ తల్లికి వందనం అమలు చేస్తుందన్నారు. ఎన్నికల ముందు మద్యపానం పేరుతో వైసీపీ గెలిచిన తరువాత మద్యం ఏరులైపారి వేలకోట్ల రూపాయలు ముడుపులు తీసుకున్నారని అన్నారు. కల్తీ మద్యంతో 24 మందిని వైసీపీ పొట్టన పెట్టుకున్నదని వారన్నారు. వైసీపీ నిరసనల పేరుతో ర్యాలీలు చేయడం దెయ్యాలు వేదాలు వల్లించినట్టుగా ఉందన్నారు. కేశవరంలో కొండను కొల్లగొట్టారన్నారు.

బాధిత కుటుంబానికి చెక్కు అందజేత

కొత్తపేట, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పలివెల గ్రామానికి చెందిన పింగ్రాల చిన్న కుటుంబానికి టీడీపీ సభ్యత్వ బీమా సొమ్ము రూ.5లక్షల చెక్కును ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ సభ్యులు ప్రమాదవశాత్తు మరణిస్తే వారి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో పలివెల సర్పంచ్ సాదే లక్ష్మి, సాదే శ్రీనివాస్, నల్లా వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.


బీమా చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే సత్యానందరావు

కపిలేశ్వరపురం తహశీల్దారుగా శ్రీనివాస్ బాధ్యతల స్వీకరణ

కపిలేశ్వరపురం, జూన్ 2(ఆంధ్రజ్యోతి): కపిలేశ్వరపురం తహశీల్దారుగా పి.శ్రీనివాస్(ఎఫ్ఏసీ) సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ తహశీల్దారుగా పనిచేసిన చిన్నారావు ఉద్యోగ విరమణ చేయడంతో ఆయన స్థానంలో శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా తహశీల్దారు మాట్లాడుతూ మండలంలోని రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. బాధ్యతలు స్వీకరించిన తహశీల్దారును మండలంలోని పలువురు రెవెన్యూ సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిశారు.

మున్సిపల్ ఒప్పంద కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మండపేట. జూన్ 2(ఆంధ్రజ్యోతి): మండపేట మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగంలో పని చేస్తున్న ఒప్పంద కార్మికుల సమస్యను ప్రభుత్వం సత్వరమే పరిష్కరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారాణి, కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికుల శిబిరాన్ని ఆమెతో పాటు కౌన్సిలర్లు సోమవారం సందర్శించి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌లతో పాటు, కార్మికులు పాల్గొన్నారు.


మున్సిపల్ ఒప్పంద కార్మికులకు సంఘీభావం ప్రకటించి దీక్షలో పాల్గొన్న చైర్‌పర్సన్ తదితరులు